లక్ష్మమ్మ, కట్టమంచి

భోజలీల

రాజమహేంద్రవరము, 1926

Record no. 703

Lakṣmamma, Kaṭṭamañci

Bhōjalīla

Rājamahēndravaramu, 1926

Record no. 703

Bibliographic Record Target

లక్ష్మమ్మ, కట్టమంచి.

భోజలీల / కట్టమంచి లక్ష్మమ్మ ప్రణీతము.- 1. కూర్పు.- రాజమహేంద్రవరము : కృష్ణముద్రాక్షరశాల, 1926.

ii, 106 p. ;18 cm.

Record no. 703

Lakṣmamma, Kaṭṭamañci.

Bhōjalīla / Kaṭṭamañci Lakṣmamma praṇītamu.- 1. kūrpu.- Rājamahēndravaramu : Kṛṣṇamudrākṣaraśāla, 1926.

ii, 106 p. ;18 cm.

Record no. 703

SRI

BHOJA LEELA.

BY

Ca[illegible]amanchi Lakshmamma.

PRINTED BY

Messrs. S. V. Krishnamurty & Brother

[illegible]EE KRISHNA PRINTING WORKS

RAJAHMUNDRY.

1926.

[Regd.]

[Price As

శ్రీ

భోజలీల:

కట్టమంచి లక్ష్మమ్మ

ప్రణీతము.

మొదటికూర్పు 1000 ప్రతులు.

రాజమహేంద్రవరము

శ్రీ కృష్ణాముద్రాక్షరశాలయందు

ముద్రితము.

1926.

 [వెల రు 0-8-0.

శ్రీ కృష్ణ.

కం॥ కరుణాకర, నారాయణ,
పరమాత్మా, యదుకులేశ, భక్తాధీనా,
నరకాంతక, కులశేఖర
వరదా, పరమేశ గరుడవాహన కృష్ణా!

కం॥ నీకరుణన్ నే వ్రాసిన
యీకథ నంకితమొసర్తు నింపుదలిర్పన్
సాఁకిన తలిదండ్రులకున్
శ్రీకృష్ణా దీనిఁ బ్రోచి చేయుకృతార్థన్.

పండితుల యభిప్రాయములు.

శ్రీమతి కట్టమంచి లక్ష్మమ్మగారు రచించిన 'భోజలీల' యను వచనకావ్యమును విని యానందించితిని. సంస్కృతమునందున్న భోజప్రబంధము ననుసరించి యీగ్రంథము వ్రాయఁబడినను భోజ కాళిదాసులఁగూర్చి విడివిడిగానున్న యనేక కథల నీమె మిక్కిలి కౌశలముతోఁ బరస్పర సంబంధమెంతో యనుకూలముగాఁ గుదురునట్లు కలిపి వ్రాసి, చాతుర్యముఁ జూపుట ప్రశంసనీయము. పూర్ణార్థానుస్వారములు రేఫలు సుష్టుగా నీమె గుర్తెరిగి శబ్దప్రయోగముఁ జేయుటచే నీమెకుఁగల వ్యాకరణ ప్రవేశము సువ్యక్తమగుచున్నది. కథాసందర్భము మనోహరముగాఁ గూర్పఁబడినది. శైలి సులభమై, రసవంతమైయున్నది. చదువువారల కందఱకు నిది తప్పక యానందముఁ గలుగజేయును. ఆంధ్రమహాజనులేగాక విద్యాశాఖాధికారులుగూడ దీనికిఁ దగిన ప్రోత్సాహమొసంగుదురు గాక. ఇది యువతీమణి రచియించుటచేత నెల్లవిధముల మాననీయమైయున్నది.

రాజమహేంద్రవరము.
6—3—1926.

చిలకమర్తి లక్ష్మీనరసింహం.

భోజలీలా ప్రబంధ ప్రశంస.

తే॥ గీ॥ కట్టమంచి లక్ష్మమ్మ వ్యా—కరణసరణి
ఁఱల, బిందుల సంధుల—క్రమము ఁఱసి
సరసవచన పద్ధతి వ్రాసె—సార్థకముగు
భోజలీలా ప్రబంధంబు—బుధులు మెచ్చ.

ఇట్లు

అపర కాళిదాస కవిగురుప్రముఖబిరుదాంకితుఁడును, సువర్చలాపరిణయ హరిహరతారతమ్యాది మహాకావ్య కర్తయు నగు

రాజమహేంద్రవరము.
6—3—1926. } పూడిపెద్ది లింగమూర్తి.

భోజలీల.

మొదటి ప్రకరణము.

దేవదూతి.

అరుణోదయపుఁ గెంజాయలలము కొనుచుండఁ దూర్పుదిశ నుదయాద్రిపై లోకమిత్రుఁడైన కమలబాంధవుఁడు హరిదశ్వములఁ గూర్చిన తన యరదముపై నెక్కి మిక్కిలి త్వరితగతి నరుదెంచుచుండెను. అతనిఁ జూచి చీఁకటి యంతయు భూగృహములందును, మూఢజనుల హృదయములందును, కరివరద రాజబిరుదాంకితులగు జనుల శరీరచ్ఛాయలందును, డాఁగెను. సకల సరోవరములందలి కమలములును గమలములని చెప్పుటకు సరిగా వలయాకారముల ధరించెను. పక్షులన్నియు సూర్యున కెదురుగా స్వాగతము లిచ్చునవివోలె తమతమ ఱెక్కలనాడించుచుఁ గలకలమని యఱచుచు వాని వాని యునికిపట్టులవిడిచి రా నారంభించెను.

అట్టి సమయమున నొకకోటమీఁద నిరువురు పురుషులీరీతి మాట్లాడుచుండిరి.

మొదటివాఁడు—ఎవరవోయి, అక్కడ?

రెండవవాఁడు—నారదమునీశ్వరులకు వందనములు. స్వామీ! నేను కామధేనువు కాపరిని.

నా—ఎక్కడికిటుల వచ్చుచున్నావు?

కా—ఏమనిచెప్పుదును బాబూ! కామధేనువు పాలెండిపోయినది. దూడకైననుఁ జిక్కనందున భూలోకమునకైనఁ బోయి కొంతగడ్డి తెచ్చి వేయుదమని పోవుచున్నాను.

నా—ఏమది! యాశ్చర్యము? కామధేనువు వద్ద పాలు లేకుండు టేమి! దూడకు గడ్డియేమిటి! నాకేమియు నర్థము గాలేదు.

కా—దేవా, ఏమని చెప్పుదును. ఎవఁడో మహాత్ముఁడు, వానియమ్మ కడుపు చల్లగా నుండుగాక! మహాదానవరుఁడట, దానము చేసిన నేమి? ఇంత యన్యాయమా? మునీశ్వరా, మేమెఱుఁగమిట్టి మహాత్మ నీవఱకు. దేవతాధిపతులైన త్రిమూర్తులనే ముప్పతిప్పలుపెట్టి మూఁడు చెఱువుల నీరు త్రాగించెను. ఈసంగతి మేఁతకై పోయిన కామధేనువు చెవులఁ బడెఁ గాఁబోలు, సిగ్గుచేఁ బా లెండి పోయినవి.

నా—భూలోకమున నెవరోచేసిన దానకీర్తి కామధేనువున కెట్లు తెలిసెను?

కా—మహాత్మా, అంతయు నెఱిఁగిన మీరు నన్నడుగుట చూడఁగా నానోటనే వినగోరి యడిగినట్లున్నది. దేవ

లోకమున దేవతలా మహారాజును గూర్చి యాడుకొన్న మాటలు నేవినినంతవరకుఁ దెలిపెద. చిత్తగింపుఁడు.

భూలోకమునఁ బొగడఁ దగినదై సిరులకు నాఁటపట్టై వెలయు ధారానగరమను పట్టణ మొకటి గలదఁట. అందు భోజుఁడను మహారాజు రాజ్యము సేయుచున్నాఁడఁట. ఆమహారాజునకు విద్యాభిలాష యెక్కువగుటచేఁ దనరాజ్యమందు విద్యలేనివారుండఁ గూఁడదని తలఁచి "నారాజ్యములోనే స్త్రీగాని యేపురుషుఁడుగాని విద్యలేకుండ నుండఁగూఁడదు. అట్లు విద్యలేని వారెవరే నుందురేని వారు కారాగృహమున నుంచఁబడుదురు" రనియును.

"విద్యనేర్చి కవిత్వముచెప్ప శక్తుఁడగు ప్రతిమనుష్యుఁడును నాసభకు నిరాటంకముగ రావచ్చు" ననియును

"అట్లు వచ్చినవారు నన్ను మెప్పించి ధనముగొని జీవింపవచ్చు" ననియును శాసనముల నేర్పఱచి రాజ్య మంతటనుఁ జాటించెనఁట.

మఱియు విద్యకొఱకు డబ్బు వెచ్చింప శక్తులు గాని వారికి ధర్మపాఠశాల లేర్పఱచెనఁట. స్త్రీవిద్య నభివృద్ధిఁ బొందింపవలయునను తలంపున పురుషులకంటె స్త్రీలకు నధికముగ ధనము, భూషణములు, వస్త్రములు నిచ్చి యాదరించుచుండెనఁట.

ఇట్లా మహారాజేర్పాటు చేయుట వలన నేమాత్రము విద్య నచ్చిన వారును రాజసభకువచ్చి రాజునుఁ బొగడుచుండిరఁట. ఏమాత్రము పొగడిన వారి కామాత్రము ధనము నిచ్చుచుండెనఁట. మఱియు వారి పద్యములయొక్క సారమునుఁబట్టి యక్షరలక్షలిచ్చుటయుఁ గలదఁట. మంచి మదపుటేనుఁగులును, శుభలక్షణ సంపన్నములగు గుఱ్ఱములును, బ్రిహ్మ జాతి నగ్రిములును, నిచ్చుచుండునఁట.

ఇట్టి యమితమైన దానకీర్తిని విని మెచ్చ,మెచ్చుటకై పండితులు వచ్చి యాభోజరాజు నాశ్రయించుచుండురఁట. అట్లేతెంచి తన యొద్దనేయుండ నిష్టపడిన వారికి నిండ్లిచ్చి, వారికి జీతమేర్పఱచి, ప్రితిదినమును వారు తన సభ నలంకరించు నట్లుత్తరువుఁ జేయుచుండెనఁట. ఇట్లు చేయుటవలనఁ గ్రమముగా నయిదునూర్ల కధికముగఁ బ్రితిదినము తనసభ నలంకరించు పండితులు చేరిరఁట.

సాధుశీలా, యీరీతి ధనమిచ్చి యాదరించుట వలన భూలోకము దరిద్ర మెట్టిదో యెఱుఁగక పోయెను. ఆకీర్తికాంతి భూలోకమంతయుఁ దిరిగి స్థలము చాలక దేవలోకమునకుఁ బోయెను. అట్లు పోయి యాలోకమంతయు మేఘమువలె గ్రిమ్ముకొనెను. ఆలాగు క్రిమ్ముకొనుటచే దేవలోకము సూర్యునియొక్క వేడి యెటువంటిదో యెఱుఁగక పోయెను. ఆవిధ

మున సూర్యరశ్మి దగులనందున స్వర్గమంతయుఁ దెల్లఁగా పాలిపోయెను.

ప్రితి వస్తువునకు సూర్యరశ్మి దగులవలెను. ఏయాకుగాని యేకాయగాని సూర్యకిరణములు దగులనియెడల నది తెల్లనై పోవునట్లే యీభోజ మహారాజుయొక్క దానకీర్తి సూర్యుని కడ్డముగా మేఘమువలెఁ గ్రమ్ముకొనుట వలన లోకమంతయుఁ దెలుపు నలుపు గుర్తించుటకు వీలులేక ప్రితి వస్తువునుఁ బాలిపోయెను. అట్లు పాలిపోవుట వలన పూజ్యులగు త్రిమూర్తులకే మిక్కిలి కష్టమాయెఁ, గనుక, నితరులతోఁ బని లేదని, హరిహర హిరణ్యగర్భుల సంగతియే చెప్పుచున్నాడను.

ఓపితామహసుతా, ఆలకింపుము. మహావిష్ణుని పాలసముద్రిమును, నీలకంఠుని వెండికొండయు, బ్రిహ్మ హంసయుఁ దెల్లనివి గనుక వారికీ మూఁడు వస్తువులఁ దెలిసికొనుట కష్టమాయెను. కాఁబట్టి వానిఁ దెలిసికొనుటకుఁ గానీ విధమున వా రేర్పాటుఁ గావించిరి.

ఎట్లనఁగా, శ్రీమన్నారాయణుఁ డేది మజ్జిగ పడి విఱుఁగునో యది తన పాలసముద్రిమని తెలిసుకొనుటకుఁ గాను కొంతమజ్జిగ చేతఁ గొని ప్రితి సముద్రములోను కొన్ని బిందువులు వైచి కనిపెట్టుచుఁ బోవుచుండెను.

పరమేశ్వరుఁ డన్ననో, ప్రితి కొండనుఁ దన నుదుటి కంటితోఁ జూచి, యది కాలి భస్మమగుచున్నదా, లేక వెండి

ముద్దవలె కరఁగుచున్నదా యని పరీక్షించుచుఁ బోవుచుండెను.

సృష్టికర్త, పాలు, నీరు కలిపి చేతఁబట్టుకొని పక్షిగుంపులున్నచోటుల కంతయుఁ బోయి యొక్కొక్క పక్షికడ నా పాలనుంచి యేపక్షి పాలును నీరును వేరుచేయుచున్నదో యది తన పక్షియని గుర్తించుకొనుటకుఁ బోవుచుండెను.

ఇట్లా ముగ్గుఱు చాల యిక్కట్లుపడి చివరకు నేకస్థులై కూర్చుండి, యెందుచేత మనలోక మీరీతిఁ దెల్లవడుట? యని యోచించిరి. అప్పుడు వారికి భూలోకమున భోజమహారాజు చేయు దానము వలని కీర్తి క్రమ్ముకొనిన దని తెలిసెను. ముగ్గుఱకు నాశ్చర్యమాయెను.

అప్పుడు బ్రహ్మ, ఆహా! భూలోక మేమిటి! అచ్చట సామాన్యుఁడగు రాజేమిటి! అతఁడు దానము చేసిననేమి! ఇంత యమోఘమా? ఈ వఱకు నటువంటి రాజులే లేక పోయిరా? అంతటి ఘనుఁడా? చూచెదఁగాక యీదానము వలని కీర్తికాంతియొక్క బరువెంత యుండునో. మాశివుని వెండికొండంత బరువుండునా? అని యొకవైపు వెండి కొండయు మఱియొకవైపు భోజమహారాజు కీర్తియు నుంచి తూఁచెను.

మునీశ్వరా, ఏమని చెప్పుదు నా యాశ్చర్యము! వెండి కొండ యున్నవైపు తక్కెడ యాకాశముఁ జూచెను.

అప్పుడు బ్రహ్మ ఇంకను జూచెదఁ గాక యని యందుమీఁద నెద్దు నుంచెను. అదియు దేలిక కాఁగా శివుని గూర్చుండఁ జేసెను. అప్పటికిని ఫలము లేక పోఁగా నాశ్చర్యపడి మహావిష్ణు పాదమునందుఁ బుట్టి యాకాశ మంతయు మిక్కిలి యట్టహాసముతో ప్రవహించు గంగాదేవి నాయన శిరస్సునందుంచెను. చూచు నప్పటి కదియు భారము లేక పోయెను. అప్పుడు బ్రహ్మ తలయూచుచుఁ గావుననే యింత యాయెనని యందు మీఁదఁ బాపఱేని నుంచెను. అప్పటికిని సరిగా లేసందునఁ జేయునది లేక నిరుత్సాహుఁడై యమృత కిరణుఁడగు చంద్రు నుంచెను.

ఇట్లు బ్రహ్మదేవుఁడు చేసినపని త్వరలో దేవలోకమంతయు వ్యాపించెను. గోరుచుట్టు మీఁద ఱోఁకటిపోటన్నట్లు వారి వారి వస్తువులు గుర్తించ లేక యున్న దేవతలకును మేఁతకై తిరుగు చున్న కామధేనువునకునుఁ జెవులఁ బడెను. ఆలాగు కామధేనువు విని, „ఆహా! ఎవరా మహారాజు? ఈ నాటికి నా బ్రతుకు వ్యర్థమాయెను. ఇది వఱ కందఱు నా పేరు కామధేను వని వాడుకొను చుండిరి. ఇఁక నా పేరెత్తరు.” అని సిగ్గుఁ జెంది యింటికి వచ్చెను. తల్లి వద్దకు పాలకై దూడ వచ్చెను. వచ్చి యేమి ప్రయోజనము? తల్లి వద్ద నేమాత్రముఁ బాలు లేవు. దూడ యఱవను మొదలు పెట్టెను. అప్పుడు దేవలోకమున నున్న యాబాలగోపాలము వచ్చి చేరెను.

అట్లు వచ్చిన వారందఱు కామధేనువు వద్ద పాలు లేకుండుటఁ జూచి యాశ్చర్య విషాదముల పాలైరి. చిన్నలైన వారు పెద్ద వారితో యోచించియుఁ జేయునది లేక నన్ను గడ్డికై పంపఁగా నిటు వచ్చు చున్నాడను.

స్వామీ, గడ్డికై భూలోకమునకుఁ బోవలయునా యని యడిగెద రేమో! స్వర్గలోకమున నిష్ప్రయోజన మైన గడ్డి యుండునా? యనియు నట్లున్న నీ లాగు తెల్లఁ బడి నవ్వుడు గడ్డిఁ గని పెట్టుట కష్టము గదా? యనియు నిట్లు వచ్చుచున్నాడను.

నా—(ఆ గొల్లని మాటలకు నవ్వి) దేవలోకము దెల్లఁబడుటచే నైనను భూలోక మందున్న భోజరాజు కీర్తి దెలిసికొంటివి. కథ విన్నను చక్కగానే వింటివి. నాకుఁ జెప్పినను జక్కగానే చెప్పితివి గాని ,పిచ్చివాఁడా, అటు వంటి మహాత్ముఁడున్న భూలోకమునకు గడ్డికై పోవుచున్నావా? అచ్చట గడ్డి యుండునా? ఆ భోజరాజు నెదిరించిన వైరులాగడ్డిఁ దినివేసిరి.

కా—అలాగా? అటు వంటి పరాక్రముఁడా?

నా—సందేహామా? ఇప్పుడు భూలోకమున రాగి, యినుముఁ గూడఁ లేదు.

కా—ఆ మహాత్ముఁడున్న దేశమున నీ యల్ప లోహముల కేల కఱవు?

నా—క్రూరులగు జనులకు సంకెళ్లు వేయుట కినుమును దాన శాసనములు నిర్మించుటకు రాగియు, వ్యయమయినవి గనుక నీ రెండు వస్తువులు గూడ నిప్పుడు భూలోకమున లేవు. నేనును స్వర్గమునకే వచ్చు చుంటిని. అని చెప్పఁగా గొల్లఁడా మాటలకు మిక్కిలి యాశ్చర్య పడినవాఁడై ముందుగా దేవేంద్రునకీ సంగతి నెఱింగించుటకై యతి త్వరగా వెళ్లెను.

రెండవ ప్రకరణము.

దేవేంద్రుఁడు భోజుని గీర్తించుట.

దేవేంద్రుఁడు సింహాసన మధిష్ఠించి యుండ నష్టదిక్పతులును వారి వారి యాసనముల మీఁదఁ గూర్చుండి యుండ, రంభ, యూర్వశి మొదలైన యాట కత్తెలు నాట్యము చేయుచుండ మును లందఱు యోగ దృష్టిచే సర్వము నరయుచుండ గడ్డికై పంపఁబడిన కామధేనువు కాపరి వచ్చి దేవేంద్రునికి నమస్కరించి, దేవా, గడ్డి భూలోకమున లేదనియు, భోజరాజు నెదిరించిన వైరులా గడ్డిఁ దిని రనియు నీ మహాను భావుఁడగు నారద మునీశ్వరుఁడు చెప్పఁగాఁ దిరిగి వచ్చితి నని చెప్పెను.

అప్పుడు దేవేంద్రుఁ డాసనము నుండి లేచి సభయందున్న నారద మునీశ్వరునిఁ జూచి, "ఓ మహామహుఁడా, భూలోకమున నింతటి రాజుండునని మే మెప్పుడు విని కని యెఱుఁగము. మీరు తఱచుగా భూలోకమునకుఁ బోయి యచ్చటి విశేషములఁ జూచుచుందురు. కనుక దయచేసి మా కా మహారాజు దాన విషయిక చరిత్రము సవిస్తరముగ నెఱిఁగింప వేఁడుచున్నాఁడను. మీ కాతని చరిత్ర చక్కఁగా దెలిసి యుండును" అని ప్రార్థించెను.

నా—ఓ దేవతాధిపతీ, భూలోకమున నున్నను, ఆ మహానుభావుఁడంత పూజనీయుఁడే; ఆతని శుభ చరిత్ర మెఱుఁగ వలసినదే, నాకుఁ దెలిసినంత వరకుఁ జెప్పెద వినుము. భూలోకమున బొగడఁ దగినది ధారానగరము గలదనియు నందు భోజమహారాజు గలఁడనియు, నెఱుఁగుదువుగదా? ఆ మహారాజు కీర్తిచే జగమెల్ల నీలాగు తెల్లఁ బడినదని తెలిసెను గదా? ఇఁక నీవు తెలిసికొన వలసినది దానము చేసినను, ఇంతటి ఘనమా? అనియే గదా? అది యెందుచేత ననఁగా, ఎప్పటికి నుత్తమ సతిగల పతియు, నుత్తమ పతిగల సతియుఁ, బ్రకాశింతురు. ఎటువంటి మణియైనను మంచి యపరంజితోఁ బొదిగి నప్పుడే ప్రకాశించును. అతఁడు తన యుత్తమ సతితోఁ గలసి చేయు దానమెంతటి ప్రకాశముతోఁ గూడి యున్నది!

దే—మహానుభావా, మీరు చెప్పిన మాట నిక్కమే; నా కా యుత్తమ సతి ప్రభావ మెఱిఁగించి నా వీనులకు విందు చేయఁ బ్రార్థించుచున్నాఁడను.

నా—దేవేంద్రా, భోజ మహారాజు తన రాజ్యము విద్యచేఁ బ్రకాశింప వలయు నను తలంపున "నా రాజ్యములో విద్య లేని వాఁడెవ్వఁడు నుండఁ గూడదనియు విద్య నేర్చి కవిత్వముఁ జెప్ప శక్తుఁడగు వాఁడు నా సభకు వచ్చి నన్ను మెప్పించి ధనము గొని జీవింప వచ్చు" ననియు నేర్పఱచి నందునఁ బ్రతి స్త్రీయుఁ బురుషుఁడును వచ్చి యా మహారాజునుఁ బొగడి ధనము గొని పోవుచుండిరి.

మఱియు, నా రాజు వద్దనే యుండ నిష్టపడిన వారికి దినజీత మేర్పఱచి యుంచుకొనుచుండెను. అటువంటి కవులు వరరుచి, బాణుఁడు, మయూరుఁడు, రేవణుఁడు, హారి, శంకరుఁడు, కళింగుఁడు, పూరుఁడు, వినాయకుఁడు, మదనుఁడు, విద్యావినోదుఁడు, కోకిలుఁడు, తారేంద్రుఁడు, కాళిదాసుఁడు మున్నగు వారైదు నూర్ల కధికముగఁ జేరిరి. ఇందఱిలోఁ గాళిదాసు కవికోటి శిరోభూషణ మనఁదగి యుండెను. అందు వలన భోజ మహారాజు కాళిదాసునుఁ గవుల కందఱకు రాజుగ నియమించి సభలో మిక్కిలి ఘనత నొసఁగి యుండెను.

మూడవ ప్రకరణము.

పండితుల పన్నుగడ.

కలిమి లేములు కావటి కుండల వంటివి. ఎప్పటికిని కాలమొక తీరున నుండదు. జగముల వెలిగించు సూర్య చంద్రులను గ్రహములు గప్పుట గలదు. అలాగే యీ భోజ మహారాజు సభాలంకారుఁడును, కవి శిఖామణియు, నగు కాళిదాసుని మీఁదఁ గవి సంఘమున కంతయు నీర్ష్య జనించెను. ఎందు వలన ననఁగా కాళిదాసుఁడు మిక్కిలి చక్కని వాఁడు, గుణవంతుఁడు, అపారవిద్య గలవాఁడు, కవిత్వము చెప్పుట యందు మిక్కిలి నేర్పరి. ఏసమయము నందును మహారాజాభీష్టమునకు సరియని తోఁచునట్లు సమస్యలు పూర్తి సేయు వాఁడు. ఇటువంటి గుణము వలన రాజు మనస్సునుఁ బూర్ణముగ నాకర్షించి వశము చేసు కొనెను. భోజ మహారాజు పండితుల నడుమ ప్రకాశించు కాళిదాసుని తేజస్సుఁ జూచి "లోకమంతటఁ గలుగు గాఢాంధకారమును బోఁగొట్టు సూర్యునివలె నాసభ యందలి మూఢత్వమను నంధకారమును బోఁగొట్టి విద్యచేఁ బ్రకాశింపఁ జేయు సరస్వత్యపరావతారుఁడ"ని పొగడును. కాళిదాసు సభకుఁ రాగానే రాకాశశాంకుని రాఁకకు గుముదమ్ములు ముదమ్ముఁ జెందునట్లు మిక్కిలి సంతోషముతో రాజెదురేగి కౌఁగిలించుకొని కైదండ యొసఁగి, కొని వచ్చి యర్థాసనమిచ్చిఁ కూర్చుండఁ బెట్టుకొని, కవిశ్రేష్ఠుఁడా, ఏలయింత యాలస్యము చేసితివని కొంతవడి సల్లాపముతోఁ గాలముఁ గడపును.

ఈ మహారాజు కాళిదాసునితోనే కాలయాపనము చేయునేమో? యని తలఁప వలదు. శాశ్వతముగఁ దనసభ నలంకరించు నయిదు వందల కధికముగ నుండు పండితులకెల్ల నెప్పటివలె లక్షలకొలఁది ధనము నిచ్చు చుండెను. ఏదైన నొక సమస్య నిచ్చిన, నది కవులందఱు వారి వారికిఁ దోఁచినట్లు పూర్తిఁజేయుట గలదు. అట్లందఱు పూర్తిఁజేసినను రాజు చిత్తమునకు సరిపోవునది కాళిదాసు పూరించు నదియే, కనుక నందఱికి లక్షయిచ్చిన కాళిదాసునకు రెండు లక్షలిచ్చును. "ఇది నాయభిప్రాయ"మని మెచ్చుకొనును.

ఇందు వలన పండితులు రాజు నొద్ద నెంత ధనము సంపాదించు చుండినను, కాళిదాసుని వలన నేయిక్కట్టు లేక పోయినను, పండిత సంఘమున కంతయు నాతనిపై నొకవిధమైన యసూయ జనించెనని చెప్పుచున్నాడను.

అట్లసూయ జనించిన మాత్రమునఁ గాళిదాసు నేమైనఁ జేయుటకు వీలున్నదా? లేదు. భోజమహారాజునకుఁ బ్రాణ బంధువు, ప్రియమిత్రుఁడు, మనస్సున కానంద దాయకుఁడు, విద్యకు శారదాదేవి వంటివాఁడు, అటువంటి వానిని సభ

వెడలఁ గొట్టించుట యున, వారి వలన నగు పనియా? లేక యేదైన నిందమోపుటకైన వీలున్నదా? లేదు. దేనివలన ననఁగాఁ గాళిదాసొక యుద్యోగస్థుఁడు కాఁడు, అతఁడు నిండు సభలో రాజు నెదుటికి వచ్చి, రాజునకు సంతోషము కలుగఁ జేయు రెండు మాటలు పలికి వెళ్లిపోవువాఁడు. అటువంటి వానిమీఁద నేమినింద మోపవచ్చును? ఎట్లు వారి కసి తీర్చుకొనుట? కాళిదాసుఁ డున్నన్ని రోజులు మిగిలిన పండితులకు గౌరవము లేదు. ఎంతడబ్బు రాజు వలనఁ బడసి యేమి ప్రయోజనము? మనస్సంతోషము లేదు. సంతోషము లేని బ్రతుకేమి బ్రతుకు? ఈ మహారాజు సభ వదలి యేదేశమైన వెళ్లిన నిట్లపార ధనముసంపాదించఁ గలరా? ఏరాజైన నింత దానపరుఁడా? అటువంటి మహారాజును దమ బద్ధ విరోధియైన కాళిదాసుని పాలు గావించి పోవుటకు సమ్మతింతురా? సమ్మతించరు. ఎట్లైనఁ గాళిదాసుని వెడలింప సమకట్టి, పండితులంద ఱక్కడక్కడ రహస్యముగ సంఘీభూతులై మాట్లాడ మొదలిడిరి.

నాల్గవ ప్రకరణము.

భువనేశ్వరి యాలయము.

ధారానగర రాజ్యమునకు రెండు మూఁడు మైళ్ల దూరమున భువనేశ్వర్యాలయ మొకటి గలదు. ఆ యాలయమిప్పుడు మిక్కిలి ఘనఁతగాంచి భోజమహారాజుచే పోషింపఁబడుటచే ప్రకాశముగా నున్నది. ధారానగరమునుండి భువనేశ్వరి యాలయమునకుఁ జక్కని రాచ బాటగలదు. ఆదారికిరుప్రక్కల నెత్తైన గొప్ప వృక్షములు పెంపఁబడి వచ్చుపోవు వారికిఁ జల్లదనమిచ్చుచు నానందము గలుగజేయు చుండును. ఆ చెట్లకుఁ జేరికగానే మంచి రసవంతములగు పీటభూములెప్పుడుఁ బచ్చని పైరులచే నావృతములై కన్నుల కానందము గలుఁగజేయు చుండును.

ఇట్టి దారిలో దేవాలయమునకు బయలుదేరితిమేని యేమాత్రమైన నాయాసము లేక యారెండు మూఁడు మైళ్లు రెండు మూఁడు గజములవలెఁ దోఁచును. అట్లు పోవు వారికి దేవాలయపు ద్వార దర్శనము గలిగెనేని సర్వమును మఱవవచ్చును. ఎందుచేత నన, దూరమున నుండఁగనే గర్భాలయమునకు ముందుండు ధ్వజస్తంభము బంగారముతోఁ జేయఁబడి, నవరత్నములు పొదుగఁబడి, తళతళమని మెఱయు చుం

మను. ప్రాకారపుగోడ లన్నియు వెండి నీరు పూఁతఁ బూయఁ
బడి తెల్లగా నుండును.

ఇట్టి వింతఁ జూచుచు, ముఖద్వారము గడచి లోప
లికి వెళ్లఁగనే, యమిత వైభవముగ గర్భాలయము కట్టఁబడి
యుండును. ఏలాగనఁగా, క్రింద నేల యంతయు వెండిరేకులు
పఱపబడి యుండును. పైకప్పంతయు బంగారపుఁ బెంకు
లతోఁ గప్పఁబడి యుండును.

అట్టి యాలయము మధ్యఁ బద్మాసనియైన యాదేవి
వజ్రాభరణములతోఁ బీతాంబర ధారిణియై చూచువారి
కన్నులకు మనోహరముగ మిఱుమిట్లు గొలుపుచుండును.
సాయంకాలమున దీపారాధన సమయమున నాతల్లినిఁ జూచిన
కన్నులతో నేప్రక్కఁజూచినను, వజ్రములవలెనే మిన మిన
మని మెఱయుచు మఱేదియుఁ గనపడక యుండును.

ఇట్టి గర్భాలయము దాటి యీవలికివచ్చినఁ దక్కిన
యాలయమంతయుఁ జక్కని యాగ్రా ఱాళ్లు పఱపఁబడి
యడుగుఁబెట్టిన మైలగునేమో యను శంక కలుగునట్లుండును.
చుట్టునుండు గోడలమీఁదఁ జిత్రవిచిత్రములగు బొమ్మలు
వ్రాయఁబడి పూర్వికుల చరిత్రముల దెలుపు చుండును.

ఇంకఁ గొంత దవ్వేగిన నచ్చటఁ జక్కని కోనేరు
గలదు. ఆకోనేటినీళ్లు వాడుట లేక గాఁబోలు మిక్కిలి పచ్చగాఁ

బ్రాఁచి పట్టియుండును. ఆకోనేటికి దగ్గఱఁగా వర్ణించుట
కలవి గాని పుష్పముల తోట గలదు. తెలియని వారది చూ
చిన నీపట్టణమందలి నందనోద్యానమని తలఁతురు గాని, నే
నాలాగు చెప్పను, దేనివలన ననఁగా, నిచ్చట నుండు పారి
జాత మచ్చట లేదు. అటువంటి పూఁదోట గలదు. మఱియు
నచ్చటఁ గల సరోవరములందీ యాకాశ తామరసములఁ
బోలుఁ దామరలున్నవి. అయిన నివి పసిఁడి తామరలు గదా
యనెదరేమో, అవి పసిఁడివి గాకపోయినను, వాని చక్కఁ
దనముఁ జూచి వీనికిఁ బోల్చితిని. ఆపుష్పములు తోనే భోజ
పత్ని లీలావతీదేవి యంబికాపూజఁ జేయుట గలదు. కనుక
లీలావతీదేవి చెలికత్తె లెవరైనఁ బుష్పములు దెచ్చుటకై ప్రతి
దినము నీసరోవరము చెంతకుఁ బోవుచుందురు

ఆలాగే యొకనాఁటి యుదయము పుష్పములు కోసి
తెచ్చుటకుఁ దరంగవతి యను దాసిపోయెను. అది మిక్కిలి
చమత్కారిణి. టక్కులు, మాయలు దానికి నుగ్గులోఁ బెట్టిన
గుణములు. అది పుట్టినప్పటినుండి పరులకుఁ జెడుగు చేసినదే
గాని మంచి తలఁచుట కలలోఁగూడ దాని కిష్టముండదు.
బ్రహ్మ దాని నాడుదానిగఁ జేసి, మఱచి నాగుఁబాము గుణ
ము నిచ్చినాఁడు. అయిన నది తన చమత్కారముచేత రాజా
ను మెప్పించి, నగరునందాతనికిఁ గాళ్లొత్తు దాసిగా నిర్ణయింపఁ

బడి యుండెను. సాధారణముగఁ బరిచారిక లెందఱో యుందురు గాని, యందందఱు నమ్మదగనివారుగా నుండరు. అందఱు నమ్మఁదగిన వారుగా నుండరు. అందులో నెక్కువ చమత్కారముగ నందఱకు మిక్కిలి యనుకూలముగ నెవ్వరు నడుచు కొందురో, యట్టి వారలెల్లు బుద్ధి దిరిగిన నట్లు చేయుదురు. అటువంటిదే యీ తరంగవతి యను దాసి.

ఇది కమలములు గోసి తెచ్చుటకు రాణిచే ననుజ్ఞాతయై వచ్చినది. తనపని త్వరలో ముగించుకొని పోక, చిన్నతనపుఁ జేష్టలచేత నిటు నటుఁ జూచుచు నాఁడుచుఁ బాఁడుచుఁ బుష్పములు గోయుచుండెను.

ఐదవ ప్రకరణము.

పండితుల సమావేశము.

అప్పుడా సరోవరము చెంతకు భోజరాజు నాస్థాన కవులగు బాణ, మయూరాదులు వచ్చిరి. అప్పుడే పుష్పములు గోయు తరంగవతి వారినిఁ జూచి, "ఎవరు వీరు? భోజరాజు నాస్థాన కవులని తోఁచుచున్నది. ఎందు కిటు వచ్చినారు"? అని తలఁచు చుండగనే వారును తరంగవతిని సమీపించి, "తరంగవతీ, క్షేమమా," యని యడిగిరి. ఆమాటలకుఁ దరంగ

వతి కాశ్చర్యము గలుగఁగా "నెన్నడు లేనిది వీరు నన్నుఁ బలుకరించుటకుఁ గారణమేమి"? అని యనుకొని, "పండితులారా, వందనములు. పండిత సంఘముచేఁ బ్రకాశించు భోజమహారాజు దాసినగు నాకు క్షేమమునకుఁ గొఱఁతయేమి"? అనెను. ఆమాటలకు మిక్కిలి సంతసించిన వారై పదిలక్షలు వరహాలు వెలగల పచ్చలహార మామె మెడనువైచి యాశీర్వచనముఁ జేసి వెళ్లిరి.

ఆ బహుమతికి దాని మనస్సు మిక్కిలి యానందమున మునిఁగి తాండవమాడ నా హారమునుఁ జూఁచి "యెవ్వరైన నడిగిన నేమిగతి"? యనితీసి భద్రముగ దాచియుంచి కొని "యెందుకొఱకు నాకు వీరీ హారము నిచ్చిరి? కారణ ముండకపోదు" అని మనస్సునఁ దలఁచి, మఱలఁ "గారణమేమి? రాజునుఁ బొగడుటచే నిట్టి బహుమతిఁ జేసిరి. రాజునకుండు గుణమేఁగదా పరిజనుల కుండును" అని తన మనస్సునకుఁ దానే సమాధానముఁ జెప్పుకొని పూలు గోసికొని వెళ్లెను.

ప్రతి ప్రాణికి డబ్బునిన నాసగనుక నాబహుమతిఁ బడసి నప్పటినుండి "యీపండితు లెంత మంచివారు? వారినిఁ జూచిన బాగుండు" నను తలంపే దానిమనమున నాటియుండెను. తరువాత సుమారొక్క వారమునకుఁ దరంగవతికి మఱలఁ బండిత సంఘముఁ గాంచు భాగ్యమబ్బెను. ముందు పరి

చయమున మిక్కిలి దగ్గఱకు వచ్చిన వారై పండితులు "తరం
గవతీ, రాణి లీలావతిదేవి గారివలన మీకందఱకు సుఖమా"?
యని యడిగిరి.

అప్పుడు తరంగవతి, "మహా పండితులారా, సరస్వతీ
స్వరూపులారా, యనసూయా దేవిని మఱపించు మారాణి
యొద్ద నుండఁగా సుఖమునకుఁ గొఱంతె మా"? యనెను.
ఆమాటలకు పండితులు మిక్కిలి సంతోషముతో నానందించిన
వారై నూఱులక్షల వెలగల రత్నకంకణము లామె చేతులఁ
బెట్టిరి. ఆగాజులు చూచుకొని మిక్కిలి మురిసిపోయి వార
లకు మిగుల నణకువతో వందనముఁజేసి నిలుచుండెను. అ
ప్పుడు వారు మిక్కిలి చనువుతో, "తరంగవతీ, మఱల నొక
నాటికి నిన్నుఁగలిసెదము. అప్పుడు నీతోఁ గొన్ని మాటలు
మాట్లాడ వలయును రమ్మా" యనిరి. దాసియు మిక్కిలి
సంతోషముతోఁ "దప్పక వచ్చెదను, నావలన మీకేమి గా
వలయునో తప్పక చెప్పవచ్చు" నని చెప్పి వెళ్లెను. వారును
మిగుల నానందముతో "మఱల నెప్పుడు తరంగవతిని చూచు
భాగ్యమబ్బు"నని తలఁచుచుఁ బోయిరి.

మఱలఁ గొన్ని దినముల కొకనాఁడు తరంగవతికి పం
డితుల సందర్శనమయ్యెను. అప్పుడు తరంగవతి కెంతయో
మది నుత్సాహము గలిగెను. పండితులవద్ద బహుమానము

దొరికినప్పటి నుండియు నుద్యానవనమునకు వచ్చినప్పుడంత
యు దానికిఁ బండితులు గనఁబడిన బాగుండుననియే తలంపు.
అయిన నెప్పుడును పండితుల దర్శనము గాదు. ఏలన, వారు
వచ్చినప్పుడు దాసి సంధించదు. దాసి వచ్చినప్పుడు వారు
రారు. ఇందువలన నెప్పుడో యొకప్పుడు వారమున కొకమారు
పండితులును తరంగవతియును సంధించుట మిక్కిలి యరుదు.
ఇందు వలననే తరంగవతికింత సంతోషము. ఈ పండితుల
సమావేశమైనప్పుడంతయు నమితమైన గొప్ప బహుమానము
దొఱకుచుండెను. దీనివలన నీమూఁడవ సారి తరంగవతి కెం
తయో మది నానందము గలిగెనని చెప్పుచున్నాను. దాసికే
గాదు. పండితులకుఁ గూడ వారి మనోగత మెఱిగింపఁ ద
లఁపు. కావున నీసారి కలయిక వారికిని మిక్కిలి సంతోషకర
ముగ నుండెను.

అట్లు వారు మిక్కిలి సంతోషముతోఁ దరంగవతిని
సమీపించి రెండుచేతులు గట్టిగఁ బట్టుకొని "తరంగవతీ, యివి
నీకాళ్లుగాని చేతులు గావు" అనిచెప్పిరి. అప్పుడు దానికి దిగ్భ్ర
మ గలుగఁగా "నయ్యయ్యో, యిదియేమి పాపము, మీరు నా
చేతులు పట్టుకొనవలెనా? కారణము చెప్పుఁడు" అని చెప్పెను.

అందుల కాపండితులు "తరంగవతీ, నీవు మిగుల నేర్ప
రి వనియుఁ, డక్కులు, మాయలు నీవు నేర్చిన విద్యలు చా

లఁగలవనియు, నేదైనఁబని కావలసియున్నపుడు నీనేర్పంతయు వినియోగించి చక్కఁగ నెఱవేర్తువనియు నెల్లరుఁ జెప్పుకొనెదరు. కాఁబట్టి యిప్పుడు మా మనోరథ మీడేర్చి పుణ్యము గట్టుకొమ్ము. మా కభయ హస్తమిమ్ము. ఎప్పటికిని నీవు చేసిన మేలు మఱవము" అని మిక్కిలి దీనముగ బ్రతిమాలిరి.

ఆమాటల కలరి తరంగవతి, మిక్కిలి ధైర్యముతో, "పండితులారా, ఏలసందేహము? ఆలస్యముచేయక చెప్పుడు. తప్పక చేయుటకు సిద్ధముగ నున్నాను." అని చెప్పెను అప్పుడు వారేదియో రహస్యముగఁ జెవి దగ్గఱ నోరుంచి యెఱింగించిరి. అది యేసంగతియో గాని, తరంగవతి ముఖవైఖరిఁ బట్టి చూడఁగా ముందువారి వలనఁ బొందిన బహుమతి విలువయని మాత్రము తెలిసికొనఁదగి నట్లుండెను.

ఆఱవ ప్రకరణము.

సందేహము.

ఒకనాటి మధ్యాహ్నము ధారానగర రాజవీథి నొక పురుషుఁడు పోవుచుండెను. వాఁడు చామనచాయఁ గలిగి యంత లావుఁగాక యంత సన్నముఁగాక దిటవైన శరీరము గలిగి యిరువది యైదు సంవత్సరములకు లోఁబడిన వయస్సుఁ

గలిఁగి యుండెను. వానినిఁ జూచినవారు వాఁడు చాలా దూర దేశస్థుఁడనియు నెవ్వరినో వెదఁకు చున్నాఁడనియుఁ దలఁపక పోరు. మఱియు వాఁడు భుజమునఁ దగిలించుకొని యున్న యడపమునుఁ బట్టి మంగలి వాఁడనియుఁ జెప్పక తప్పదు.

అట్లు వాఁడు కొంతదూర మేగు నప్పటి కొక పురుషుఁడెదు రాయెను. వాఁడు ధారానగర వాస్తవ్యుఁడగు బ్రాహ్మణుఁడే. అప్పుడా యిరువురి కి క్రింది సంభాషణ జరిగెను.

నూతన పురుషుఁడు—అయ్యా, యీయూరి పేరేమి?

బ్రాహ్మణుఁడు—ఇది ధారానగరము. నీ వీ యూరికిఁ గ్రొత్తవాఁడవా?

నూ—అవును. అయ్యా నే నీ యూరికిఁ గ్రొత్తవాఁడనే మిమ్మొక సంగతి యడుగఁ దలఁచితిని.

బ్రా—ఏమి? చెప్పుడు.

నూ—ఈ యూరి యందెవ్వఁడైన గాళిదాసుఁడను వాఁడు వచ్చి చేరి యున్నాఁడా?

బ్రా—ఆ యున్నాఁడు రాజ సభయందు ముఖ్యుఁడగు కవిగా నున్నాఁడు. ఏమీ? యెందుల కాపురుషు నడుగుచున్నావు. మీయూరా?

నూ—అయ్యా, మాయూరే గాదు. మాయన్న. సోదరుడు. నాకంటె జ్యేష్ఠుఁడు. మే మిరువురము కొన్ని రోజు

లకు ముందు పైతృక ధనమును విభజించుకొంటిమి. మఱలఁ గొన్నిదినముల కా యూరు విడిచి వచ్చినవాఁడు. నేటివఱకక్కడకు రాఁడాయెను. అందువలన వెదకుచు దేశదేశములు ద్రిమ్మఱి తుదకీయూరు నేఁడు చేరితిని.

బ్రా—ఛీ! నీవు మంగలివాఁడవు. వాఁడు బ్రాహ్మణుఁడు. ఉత్తమ జాతివాఁడు. మఱియు సరస్వత్యవతారుఁడైన కవి. ఎవ్వరి నెవ్వరికిఁ బోల్చెదవు.

మం—అయ్యా, నే నబద్ధమాడను. నాకతనిని జూపినఁ జెప్పెదను. నాయన్న నావలెఁ బోఁడు. మంచి రాజ లక్షణములు గలవాఁడు. విద్యావంతుఁడు. మా కులమునఁ బుట్టఁదగినవాఁడు గాఁడు. వానిని నన్నునుఁ జూచిన వారెవ్వరు నన్నదమ్ములని యనరు. అయ్యా, నీకు సందేహము వలదు. నే నబద్ధమాడు వాఁడను గాను. నాకు వానిని జూపవయ్యా. అని మిక్కిలి ప్రాధేయ పడఁ జొచ్చెను.

అప్పుడు మధ్యాహ్నము గనుకను రాజ వీధిగనుక నచ్చటి జనులు మిక్కుటముగ వారిరువురి చుట్టు మూఁగిరి. అందఱు విని యాశ్చర్యపడ సాగిరి. „ఏమి? కాళిదాసు మంగలి వాఁడా?" అని కొందఱు, „ఐయుండ వచ్చు" నని కొందఱు. „ఛీ! వీఁడు చెప్పు కాళిదాసు వేఱుగ నుండు" నని మఱికొందఱు, పరి పరి విధముల మాట్లాడుకొన మొదలిడిరి.

అప్పుడే కొందఱు పండితులు, కాళిదాసునితో రాజనగరినుండి, భోజ మహారాజు తన తండ్రి యగు సింధులునికి సాంవత్సరిక శ్రాద్ధంబుఁ బెట్ట, నప్పుడమిత గో భూ హిరణ్యాది దానములఁ గైకొని పోవుచున్నవారు, కాళిదాసుతోఁ బలువురు పండితులా వింతయేమని చూచుటకు వచ్చిరి. అప్పుడా మంగలి హటాత్తుగఁ గాళిదాసునిపైఁ బడి కౌఁగిలించుకొని „అన్నా, యెట్లు నన్ను విడిచి వచ్చుటకు నీమనస్సొప్పెను. నీవు వెళ్లిన తరువాత నిన్నుఁ గనిపెట్టి పిలుచుకొని పోవలయునని యెన్ని యూళ్లు తిరిగితిని; చివరకీ యూరుఁ జేరి యీసుదినమున నిన్నుఁ గాంచఁగల్గితిని; అన్నా, యిప్పుడు నాతో వచ్చెద ననెదవా? లేక నన్ను నీతో నుంచుకొనెదవా?" అని యడిగెను.

అప్పుడు కాళిదాసు తెల్లఁబోయి „యిది యేమి యాశ్చర్యము? ఛీ! నేనెవరు? నీవెవరవు? నాకును నీకును గల సంబంధ మేమి? నేను బ్రాహ్మణుఁడను, నిన్నుజూడఁగా నీచకులస్థుఁడగు మంగలి వాఁడవని తోఁచెడిని" అని చెప్పిన తోడనే మంగలివానికిఁ గోపము గలుగఁగా „ఛీ! నాకంటెఁ బెద్దవాడవై యెందులకీ యబద్ధమాఁడెదవు. ఇక్కడికి వచ్చి బ్రాహ్మణుఁడ వని పేరు పెట్టుకొన్నంతనే బ్రాహ్మణుఁడ వగుదువా? అంత మాత్రముననే నన్ను నీచ జాతివాఁడవని

యనవచ్చునా? ఎన్నివిద్యలు నేర్చినను కులవిద్యకు సాటి వచ్చునా? కులమును దూషించు వారు గలరా? నీమాటల వలన నీవుమన కులవిద్య బొత్తిగా విడిచితి వనుకొనెదను. నీవెంత విద్యనేర్చిన నేమి ప్రయోజనము? కులవిద్య విడిచి కులమును దూషించువాఁడు ముక్తిఁ బొందఁగలఁడా?" అని యింక నేదియో చెప్పటకు నోరెత్తఁగా

కాళిదాసుఁ డిదియేదో కపట మని యెంచి మంగలి వానిఁ ద్రోసివైచి ముందునకుఁ బోఁ బోఁ గాఁ, బండితులం దఱుఁ జేరి కాళిదాసుని మంగలి వానిని దీసికొని, రాజనగరికిఁ బోయి భోజ మహారాజు ముందుఁబెట్టి, "మహారాజా, కొంప మునిఁగెను. మాకేమైనను విచారము లేదు, ప్రాయశ్చిత్తము జేసుకోఁ గలము. కాని మీరీవేళ పితయగు సింధులునికి సాంవత్సరిక శ్రాద్ధం బీ నీచునితోఁ గడిపితిరే? మీపెద్ద లందఱు నరక కూపమునఁ బడునట్లాయెనే? ఈపరమ పాపి యెంతపని చేసెను? దీనిని మీరే విచారించ వలయును. ఈ మంగలివాని నడుగుఁ"డని చెప్పిరి.

అప్పుడా మంగలివాఁడు దిక్కులు చూచుచు గజ గజ వడకుచు, "అయ్యా, నాకేమియుఁ దెలియదయ్యా, నే నొక యూరి మంగలి వాఁడనయ్యా, నే నీయూరికిఁ గ్రొత్త వాఁడ నయ్యా, అయ్యా, నన్నే మనకున్న సర్వమెఱిగించెద నయ్యా" అని యేడ్వ మొదలు పెట్టెను.

అందుకా భోజభూపతి "యోమంగలీ, నీ కేమియు భయములేదు. సంగతి నెఱిగింపుము" అనఁగా మంగలి వాఁడు "మహారాజా, యితఁడు మాయన్న. కొంత కాలము క్రిందట మే మిరువురము పిత్రార్జితమైన ధనము విభజించు కొంటిమి. తరువాత నితఁడెక్కడికో వెళ్లిపోయి నేటివఱకుఁ గనఁబడలేదు. ఇతనినిఁ జూడవలయునను నాశ నాకు మిక్కుటము కాఁగా, వెదకుచు నెన్నియో యూళులు తిరిగితిని. ఎచ్చటను మాయన్నను గాంచుభాగ్య మబ్బక వేసరి చివరకీ యూరుఁ జేరి యీనాసుదినమున నితనిని గాంచుభాగ్యముఁ గంటిని. ఇంతలో వీరందఱు నన్నును మాయన్నను మీ సన్నిధికిఁ దెచ్చిరి" అని చెప్పెను.

అప్పుడు భోజరాజునకు మిగుల నాశ్చర్యము కలుగఁగా నేమి సేయుటకుఁ దోఁచక కవిమీఁద నుండు ప్రేమాతిశయమున నేమిచేయుటకు మనసొప్పక యందఱిని వెళ్లుఁడని యానతిచ్చి తానాదినమంతయు నుపవసించి మఱుచటి దినమున బ్రాహ్మణులచేఁ బ్రాయశ్చిత్తముఁ జేకొనెను.

ఏఁడవ ప్రకరణము.

వెక్కిరింపఁబోయి వెల్లకిలఁ బడుట.

మఱల నొకనాఁడు సభలో భోజరాజు పండితులతోఁ "గాళిదాసు మంగలివాఁడు కాఁడు. ఇది యేదో పొరపా"టని చెప్పెను. అప్పుడు పండితులందఱు లేచి యేక కంఠముగ మంగలి వాఁడని చెప్పుటకు నిదర్శన మున్నదనియుఁ గాళిదాసుఁ డంగడినుండి మాంసముఁ గొనిపోవునప్పుడు మాలో నెందఱో చూచియున్నారనియుఁ బలికిరి. అందుకు భోజరాజు, "ఓపండితులారా, మీరు కాళిదాసుఁ డంగడినుండి మాంసము దీసికొని పోవునప్పుడు నాయొద్దకుఁ బట్టితెండు. లేకున్న మిమ్ము నూరు వెడలునట్టు లాజ్ఞసేసెద"నని ఖండితముగ నానతిచ్చెను.

"అయ్యవారిని జేయఁ బోయినఁ గోతిపిల్ల యయ్యె నన్నట్లు కాళిదాసుని మీఁద నిందమోపఁబోయి కష్టము తెచ్చుకొంటి"మని యేమి సేయుటకుఁదోఁచక కవులు విచారముతో నుండిరి. ఇట్లుండఁ దుదకొకనాఁడు చేఁపలుగొని చేతఁబట్టుకొని యున్న కాళిదాసుని బాణ, మయూరాది కవులు చూఁచి మిక్కిలి సంతోషమునఁ బట్టుకొనిరి. అట్లు పట్టుకొనఁగనే కాళిదాసున కమిత భయము కలుగఁగాఁ జేత నున్న చేఁపలు

నంకఁబెట్టుకొనిఁ యిటునటుఁ జూచుచు ముందునకు వెనుకకు లాగుచుఁ దప్పించుకోఁ జూచెను.

అప్పుడా పండితులు వీనిని వదలినఁ గార్యము చెడిపోవునని గట్టిగాఁ బట్టుకొని రాజు నగరుచేర్చి రాజు నెదుటఁ బెట్టిరి. అప్పుడు కాళిదాసుని చంకనున్న చేపలనుండి దుర్గంధ ద్రవము కారుచుండెను. అప్పుడు భోజ మహారాజు మిక్కిలి విచారముతోఁ గాళిదాసునిఁ జూచి "కవిశ్రేష్ఠుఁడా, నీచంకనున్న దేమి?" యనెను.

కాళిదాసుఁడు—మహారాజా. పుస్తకము.

భోజరాజు—అయిన వాసనయేమి?

కా—యుద్ధమందుఁ జచ్చిన పీనుఁగుల వాసన.

భో—కారుద్రవమేమి?

కా—కావ్యార్థములోని సారము.

భో—తోక లేమి?

కా—కొనలు కోయని తాటియాకులు.

భో—అయిన నోకవీ, అదేమి పుస్తకము?

కా—మహారాజా, యిది యెల్లపుడు బ్రాహ్మణులచే నాదరింపఁబడు రామాయణము.

అని తిన్నగా జారవిడిచెను. చూడఁగా నది నిజముగ రామాయణమే. అప్పుడు వెంటవచ్చిన కవుల కందఱకుఁ జెప్పనలవిగానంత యవమానము గలిగెను. మహారాజునకు సంతోషము గలుగగా కాళిదాసు వెళ్లెను.

అప్పుడు భోజ మహారాజు పండితులఁ బంపివైచి కవి తనమీఁద మోపఁబడిన యొక యపవాదమును దప్పించుకొన్నందున కాదినమంతయు సంతోషముతో గడపి రాత్రి తన నియమానుసారము గుప్తవేషము ధరించి వీధులవెంటఁ దిరుగుచు నెచ్చట నలుగురు చేరి మాట్లాడిన నచ్చటఁ జెవి యొగ్గి వినుచు సంగతులు గ్రహించుచుఁ బోవుచుండెను.

ఇట్లు పోవునప్పుడొక యింట నలుగు రైదుగురు పురుషులు మెల్లగా రహస్యాలోచన చేయు నట్లలికిడి విని యాలకించగా, నందులోనివా రీవిధమున మాట్లాడు చుండిరి.

మొదటివాఁడు—భోజ మహారాజు మంచివాఁడేఁగాని యంతఃపుర రహస్యము గనిపెట్ట లేకున్నవాఁడు.

రెండవ వాఁడు—అంతఃపుర రహస్య మేమిటి?

మొ—తెలియదేమి? కాళిదాసుఁ డంతఃపుర పరిచారికా వేషము బూనిఁ సదా యంతఃపురములో సంచరించుచు లీలావతిని గూడుచుండును. అది కనిపెట్టలేని యీరాజు నిండు సభలోఁ గొంచమైనను సిగ్గులేక యందఱిముందు కాళిదాసుని కవిత్వమునుఁ బొగడు చుండును. ఆయసహ్యము నెరిగిన వారందఱికి వినుటకు సాధ్యముగాక సభలోఁ గూర్చుండుటకేఁ గష్టపడుదురు.

మూడవ వాఁడు—మన కెందుకు. ఊరకుండుఁడు. ఈకాలమున గోడకుఁ జెవులుండును.

ఇది యంతయు వినుచుండిన మహారాజు నిలువున నీరుగాఁగా కాళ్లయందు దడపుట్ట నింటికిఁజనిఁ మంచమునఁ జేరఁబడి యారాత్రి యంతయు నాలోచనా సముద్రమునఁ బడి యీదుచు దరిగానక గడిపెను.

ఈ యాలోచన చేతను, . మనస్సంకటము చేత నేమియుఁ దోచక, రాణివాసమున కేగుటకు మనస్సులేక, యాహారము రుచింపనందున సరిగా భుజించక, తన కారోగ్యముగా లేదని మేడపై హంసతూలికాతల్పమందుఁ దరంగవతి యనుదాసి కాళ్లొత్తుచుండఁ బరుండెను. మనస్సు మిక్కిలి యారాటము వలన నలసి యుండుటచే రాజు కొంతసేపు నిద్రపోయెను. అట్లు నిద్రించి కొంత సేపటికి మేల్కాని చూడగాఁ దరంగవతి చక్కగా గుఱకవెట్టి నిదురించుచుండెను.

భోజరాజప్పుడీ విధమున నాలోచించు చుండెను. ,,ఆహా! ఇది యేమి యాశ్చర్యము? ఇటువంటి మహాకవి కిది యెక్కడినింద? మంగలివాఁడని చెప్పుటకు వీలులేదు. సరస్వత్యవతారుఁడేడ? మంగలి యేడ?

అదియుఁగాక మత్సతి మీఁదను సందేహ మేర్పడెను. ఆహా! దాని నేవిధమున నమ్ముదును. లేక యేవిధమున నమ్మకుందును. నాదేవి యట్టిదే యనుకొనిన నాడువారిని నమ్మఁ

దగదు. కవి దేవాంశ సంభూతుండే యనుకొనిన దేవాంశ జనితులకు మాత్రము కామము లేకుండునా. అట్లు గాకున్న నాయింటిలోని వారట్లు మాట్లాడుటకుఁ గారణమేమి. ఆహా! దీని నెట్లు పరీక్షింతును, యెట్లు నిజ మరయుదును.”

మంచి నిద్రలో గుఱక వెట్టుచుండిన తరంగవతి ‘‘చెలీ, మదనమాలినీ, ఆదురాత్ముండగు కాళిదాసుండు దాసీవేషమున నంతఃపురము ప్రవేశించి దేవితోఁ గ్రీడించు చున్నాఁడు” అని పలికెను.

ఆపలుకులు రాజు మనస్సునకు ములుకులవలె గుచ్చు కొనఁగా, నేమిది? ఇది నిద్రించు చున్నట్లున్నది, ఇట్లు పలుకు చున్నది. అనుకొని ‘‘తరంగవతీ, తరంగవతీ,” అని పిలిచెను. దాసి పలుకక కూర్చుండియే మంచమున కొఱఁగికొని మును పటివలె గుఱక వెట్టుచుండెను.

అప్పుడు భోజ మహారాజున కాశ్చర్యమాయెను. తన మనస్సున నిట్లను తలఁచెను. ‘‘ఇది నిద్రలోఁ గలవరించు చున్నది. ఏమియు నాకు బోధపడినదికాదు. కాళిదాసు చాల యోగ్యుఁడని తలఁచి యుంటిని. ఇప్పు డొక టొకటిగా బయటఁ బడుచున్నవి. ఈదాసి యిప్పుడు మంచినిద్రలో నున్నది. కనుక నిది కలువరింత. కలువరింత యెప్పుడు నబద్ధమని చెప్పుటకుఁ గాదు. తాను బలుమారు చూచినది

నిజముగ జరిగినది తన మనస్సున నాఁటి యున్నదే కలువరించును.” అని చింతించుచుండఁగా మరల నాదాసి గుఱక వెట్టుట చాలించి ‘‘అమ్మా, మీకాళ్లకు వందనము చేసెదను కాళిదాసుని బయిటికిఁ బంపుము. రాజుగారు కనిపెట్టిన మనగతి యేమి” అని పలికెను.

అప్పుడు రాజునకు మిక్కిలి కోపము కలుగగా గట్టిగా తరంగవతిని బిలిచెను. అప్పుడది యదిరి పడిలేచి తడఁబాటుతో ‘‘మహారాజా, ఏమియాజ్ఞ? నాకేదో పాడునిద్ర యిప్పుడు పట్టినది. క్షమించ వలయును.’’ అని మిక్కిలి వినయముగఁ బలికెను. అప్పుడు రాజు, ‘‘సరి. ఏమియు లేదు వెళ్లు”, మని చెప్పి తానాలోచించుచునే పరుండి యుండెను.

ఎనిమిదవ ప్రకరణము.

మిన్నువిరిగి మీఁదబడుట.

రాత్రి మూఁడు జాములు గడచిపోయెను. నాలుగవ జామారంభ మాయెను. కాని యింకను భోజరాజ మందిరమునఁ జీఁకటిమాత్ర మావరించియే యుండెను. అయిన నంతటఁ జీఁకటి గాక యచ్చటచ్చట దీపముల వెలుఁగు కనఁబడు చుండెను. ఆదీపముల కాంతియందు దాసీజన మిటు

నటుఁ దిరుగుట గనఁబడు చుండెను. వారు భోజ మహారాజున కసౌఖ్యముగ నున్నట్టు లొకరితో నొకరు చెప్పుకొనుచు మిక్కిలి విచారముగఁ గనఁబడిరి.

అట్టి సమయమునఁ దరంగవతి యనుదాసి వడి వడిగా మహారాణి యంతఃపురముఁ జొచ్చి లీలావతితో “మహారాజు త్వరలోఁ బథ్యముఁ దెమ్మనె” నని చెప్పి త్వర త్వరగా వీధి గుమ్మము దాటి రాజవీధినే కొంత దూరమేగి తరువాత నొక సందు దిరిగిపోయెను. అట్లు కొంత దూరముపోగా నొక చక్కని మేడ గనఁబడెను. ఆమేడ చెంతకేగి తలుపు తట్టెను. అప్పుడు లోపలినుండి యొక స్త్రీకంఠస్వరమున “నెవరువారు?” అని పలుకరించెను. అప్పుడు తరంగవతి, “ఓ విలాసవతి, నేను. భోజరాజు దాసిని. తరంగవతిని. భోజరాజునకు శరీర మసౌఖ్యముగనుండి మిక్కిలి తొందరగా నున్నది. కాళిదాసునిఁ ద్వరగాఁ బిలుచుకొని రమ్మని రాజుగారి యుత్తరువైనది. మహారాజు బ్రతుకునని యెవ్వరికి నమ్మకము లేదు” అని చెప్పెను.

ఆమాటలు వినిన తోడనే కాళిదాసు మిక్కిలి యారాటముతో విడిన వెండ్రుకలు ముడివేయక, యేవిధమగు శృంగారముఁ జేసికొనకయే, తన కదివరకుఁ గలిఁగిన యవమానమునకై రెండు, మూఁడు దినములనుండి రాజ దర్శనముఁ జేయనివాఁడు గనుక “ఆహా! యీరెండు, మూఁడు నాళ్లకే యింత మూడినది” అని తలఁచుచుఁ ద్వరగాఁ దలుపు తీసికొని తరంగవతి వెంటనేపోయి భోజ మందిరముఁ జొచ్చి మహారాజు శయ్య సమీపించి నిలుచుండెను.

అప్పుడు భోజమహారాజు కవినిఁ గాంచి “కవీ, దేనిచేత నీవు రెండు, మూఁడు పొద్దులాయె నన్ను దర్శించవైతివి. నే నెట్లున్నానో చూడుము” అనెను. అంతలో లీలావతీదేవి తెల్లని పట్టుచీరె ధరించినదై రవికెఁ దొడుగుకొనకయే బంగారు పళ్లెములో నన్నము నందుమీఁదఁ బెసరపప్పును మంచి వాసనతోఁ గూడిన యప్పుడు కఱఁగఁ బెట్టిన యావునేతినిఁ జేతఁ దీసికొనివచ్చి రాజు ముందుఁ బెట్టి నిలిచి యుండెను.

అప్పుడు భోజమహారాజు పథ్యాన్నమునుఁ జూచి కాళిదాసుతో, “కాళిదాసా, పెసరపప్పు రోగమునకు సర్పము వంటిది. అయినను బొట్టు లేకున్న దేమి?” అని యడిగెను. అందులకుఁ గవిశ్రేష్ఠుఁడగు కాళిదాసు, “మహారాజా, అన్న మనెడి ప్రియునిఁ గూడుటవలనఁ బెసరపప్పు తన బొట్టనెడి రవికెఁ దీసివైచినది” అని దేవి సన్నిహితురాలై యున్నదను సంకోచము వేశమైనను లేక బదులు చెప్పెను.

ఇదంతయు వినుచుఁ జెంత నిలువఁబడియున్న లీలావతీదేవి యామాటల యర్థమును సరస్వతివలె గ్రహించినదై

పున్నమ చంద్రునివలె నున్న తన ముఖమునఁ జిఱునగవు గనబఱచి నిజనిష్కపట సారస్వత స్వాభావికమును వెలిఁబుచ్చెను.

సాధారణముగ నర్థముఁ దెలిసిన వారందులోని సారమును గ్రహింతురు. కనుక దానిలోని భావము వారి ముఖమునందుఁ గనఁబడును. విద్య నేర్చినవారు సద్గ్రంథములఁ జూచినఁ జదువ వలయునని కోరుదురు. ఆపుస్తకములనే విద్యలేనివారేమి చేయగలరు? అది మంచిదనియైన గ్రహించఁ గలరా? ఏదైన నొక పురాణము వినుచుండునపు డర్థము దెలిసిన వారి ముఖమునకును తెలియనివారి ముఖమునకు నున్న భేదముఁ గనిపెట్ట వచ్చును. ఆలాగే సరస్వతినిఁ బోలిన విద్యాధికురాలగు నాలీలావతీదేవి ముఖము కవియొక్క చతురవాక్యములకు సంతోషముతో వికసించెను.

అట్లు వికసించిన పద్మాకారమును బోలిన లీలావతి ముఖమునుఁ బరీక్షించిన రాజు మంచి నిదర్శనము దొరకినట్లు తనలో నిట్లని తలఁచెను. “ఆహా! ఈకవి నాభార్యతోఁ బొందు సల్పుచున్నాఁడన్నమాట నిజము. కనుకనే నేను వర్ణించుమనిన వెంటనే రాణి యున్నదనియైనఁ దలఁపక యంత శృంగారముగ వర్ణించుటయు, నామాటలకు రాణి చిఱునవ్వుఁ గనఁబఱచుటయు జరిగినది. ఆఁడువారి మాయలు బ్రహ్మయయినఁ గనిపెట్ట లేఁడనుట నిజము. అవివేకుఁడనగు నాకీ కవి విద్యానిపుణతయు, నాదేవి ముఖచంద్రబింబమును, దప్ప యింకేమియుఁ గనఁబడక పోయెను. దాసి కలువరింతయును, పండితుల సంభాషణయును, ఈ నిదర్శనమునకును సరిపోయినది. ఇంక సందేహములేదు. ముందు కావలసిన పని చూడవలయును. ఇంత పని చేసిన వానినిఁ జంపక విడుచుట తప్పు. అయిననుఁ గాళిదాసుఁడు సామాన్య పురుషుఁడు గాఁడు. సరస్వతి పురుషావతారము దాల్చెనని పెద్దలు చెప్పగా విందు. అదియుఁ గాక బ్రాహ్మణుఁడు. కావున నేనిప్పుడు వీఁడెంత యపరాధి యయిననుఁ జావుఁదప్పించి వేరు శిక్ష చేయవలయును” అని చాలసేపు యోచించి యూరు వెడలించుట యుత్తమ మని తలఁచి “కాళిదాసా, నీవీ నిమిషముననే మా రాజ్యము విడిచి వెళ్లవలయును. దేనివలన ,ననియైన ననుఁ గారణమడిగి తెలిసికొనుటకు నీకు వ్యవధిలేదు. నీకు వివరము చెప్పువారు లేరు.” అని చెప్పెను.

ఆపలుకులు వినిన తోడనే కాళిదాసునకు నెత్తిపైఁ బిడుగు వడినట్లాయెను. నిశ్చేష్టుఁడై నిలిచిపోయెను. తరువాతఁ గొంత సేపటికిఁ దెలివి రాఁగానే జవాబు చెప్పుటకు వీలు లేనందున నచ్చోటు వాసిపోయెను.

తొమ్మిదవ ప్రకరణము.

సరియైన యూహ.

అంత నొకనాఁడు దేవి లీలావతి యాశ్చర్యముతో "మహారాజా, రాజసింహమా, యేల పండిత శిఖామణియు, మీముఖ్యమైన యాప్త స్నేహితుఁడును, సరస్వతీ పురుషావతారుఁడు నయిన కాళిదాసుని వెడలించితిరి?" అని యడిగెను. ఆమాటలకు మహారాజు తల యెత్తి రాణిముఖము వీక్షింపక "యేమని చెప్పమనెదవు? కాళిదాసుఁడు దాసీ వేషమున నంతఃపురమున సంచరించుచు దేవిని బొందుచున్నాఁడని నాకొకరు చెప్పిరి. అదియు నమ్మక నేను ప్రత్యక్షముగా మీయిరువురనుఁ జక్కఁగాఁ బరిశీలించితిని. నామనస్సున కనుమానము దృఢమైనది. నిజమేర్పడినను ద్రోహియగు కాళిదాసుఁడు సరస్వత్యవతారుఁడగు బ్రాహ్మణుఁడని చంపక రాజ్యము వెడలించితిని. నిన్నును నాఁడుదానవని చంపక యూరకున్నాను."

అని చెప్పిన మాటలకు నరుంధతినిఁ బోలిన లీలావతీదేవి భయముచేఁ గొంతవడి యూరకున్ననుఁ జివరకు ధైర్యము దెచ్చుకొనినదై నవ్వి "నాథా, నాపూర్వ పుణ్య ఫలమా, భూలోకమును విద్యచేఁ బ్రకాశింపఁజేయు నో భోజ మహారాజా, తొలినేఁ జేసిన పూజయొక్క ఫలముచే మిమ్ములను భర్తగాఁ బడసితిని గాని వేరుగాదు. నా జన్మమునకు మీయొక్క సందేహము తీర్చవలసినదే నాభారము. ఇంతటి యపకీర్తితో నాప్రాణము విడిచిన నేమి ప్రయోజనము? కనుక నెన్ని జన్మములకైనను మీరే భర్త యగుటకును, ఇటువంటి యపవాద గలుగ కుండుటకును నేను నోములు, వ్రతములు, తపములు నేటినుండి యాచరింతును. ఆపద్బాంధవుఁడును, అనాథ రక్షకుఁడును, కరుణాకరుఁడును, భక్త వత్సలుఁడు నయిన శ్రీకృష్ణమూర్తి త్వరలో సత్యాసత్యములు మీకు దృష్టాంతముగఁ జూపును గాక. మన వంశమున కంతయు రక్షకురాలుగ నుండు దేవి భువనేశ్వరి నాసాధు శీలమును మీయెదుటను, మీపురజనుల యెదుటను స్థిరపరచును గాక" అని చెప్పి యంతఃపురమునకుఁ బోయెను.

అట్లు పోయి తన శయ్య యందుఁ బవ్వళించి యేమి సేయుటకుఁ దోఁచక యశీలాభావమున దుఃఖ మాపుకొనలేక ముఖము మీఁద చేతి నుంచుకొని వెక్కి వెక్కి యేడ్వఁజొచ్చెను. అప్పుడు నలువది యేఁబది సంవత్సరముల వయస్సు గడచిన దాది యొకతె దగ్గఱకు వచ్చి యామెనుఁ జూచెను. ఈదాది లీలావతీదేవి పుట్టినింటినుండి తోడుగాఁ దల్లిచేఁ బంపఁ బడినది గనుకను లీలావతినిఁ జిన్నప్పటినుండి పెంచినది గనుకను, మిక్కిలి చనువుతో లీలావతీదేవి చేతులు దీసి

“నాతల్లీ, నాబిడ్డా, యెందుకమ్మా యీలా గేడ్చుచున్నావు? నీ వేడ్వవలసిన కారణమేమి తల్లీ, అయ్యో, నీచిన్ననాఁటి నుండి నీతల్లి యనుమతి మేరకుఁ గనిపెట్టి యుంటినే? నాకుఁ దెలియక యెవ్వరేమనిరి? లేక యేమి కీడు మూడెను? చెప్ప వమ్మా నాయనగుఁ దల్లీ, కన్నులు దెఱచి నాముఖమును వీక్షింపుము, ధారానగర రాజ్యలక్ష్మి, నే నేమి తప్పు చేసితిని, నాతోఁ బలుకకున్నావు?” అని చేతులు పట్టుకొని మిక్కిలి దీనముగ బ్రతిమాలెను.

అప్పుడు లీలావతీదేవి యాపెద్ద దాదినిఁ జూచి, “అమ్మా, యేమని చెప్పుదును. నోరాడకున్నది. కాళిదాసుఁడు స్త్రీవేషమున నంతఃపురములో నావద్ద నున్నాఁడని యెవ్వరో నాప్రాణ నాథునికిఁ జెప్పినారఁట. ఇంకెందుకు నాబ్రతుకు? నా నాథునికి నామీఁద సంశయము గలుగఁక ముందు ప్రాణము విడుచుటకు ప్రాప్తి లేక పోయెనే? నాభర్త యది నిజమని నమ్మెనే? ఇంతకాలము నుండియు నాశీలము నెఱుగక పోయెనే? పురుషోత్తమా, కృష్ణమూర్తీ, ద్రౌపదీ మానరక్షకా, నామానమునుఁ గాపాడ లేకపోతివా? దీనరక్షకా, ఈదీనురాలినిఁ గాపాడరావా?” అని మూర్ఛిల్లెను.

అప్పుడు చెంతనున్న దాది శైత్యోపచారములచేత సేదదేర్చి “అమ్మా, లీలావతీదేవీ, వగవకుము. ధైర్యము

వదలకుము. క్షత్రియ వంశమున కంతకుఁ గీర్తిదెమ్ము. లెమ్ము. ఎవరఁట నీభర్తకుఁ జెప్పినవారు? ఎట్లు నీభర్త పరిశీలించెనఁట? ఆహా! మగవారిని నమ్మఁగూడదు. యుక్తాయుక్త విచక్షణ లేని వారు పురుషులు. ఇది నిజమా, లేక యబద్ధమా? యని చక్కఁగా శోధించకయే యేదోయొక గుర్తు పట్టుదురు. జగదీశ్వరా, ఈమె పరమ పావని. సీతానసూయలను మఱపించు పరమ పతివ్రత. ఇట్టి సాధ్వి కెక్కడనుండి యెవ్వరు గలుగఁ జేసిరీ యపవాదము. నిప్పునకుఁ జెదలంటునా? ఆహా! యెవ్వరో గిట్టని ముండకొడుకు లెందుకొఱకో పన్నిన కుతంత్రమిది. స్వామీ, యిది నీవే దీర్చుటకుఁ గర్తవు” అని చెప్పుచుండఁగానే లీలావతీదేవి దుఃఖమాఁపుకొని ధైర్య మవలంబించినదై “అమ్మా, నాభర్తను దూఱకుము. ఆయన ధర్మాత్ముఁడు. ఇది నాకర్మఫలమే గాని వేరుగాదు. దానివలనఁ బరమ పావనుని నాభర్తను నిందించుట న్యాయ్యముగాదు. ఆయన కెవ్వరో యిట్టి కపట నాటకమునుఁ జూఁపి యున్నారు. ఆ! తెలిసినది. నాఁకు జక్కఁగాఁ దెలిసినది. యోచన తట్టినది. ఇదంతయుఁ గాళిదాసుని వలనఁ గలిఁగినది. కాళిదాసుని వలన ననఁగా నతని మాయోపాయముల వలనఁ గాదు. అతఁడు జగద్విఖ్యాతిగాంచిన మహాత్ముఁడు. సరస్వతి కలి యుగమునఁ బురుషావతారము దాల్చినట్లు తెలియఁదగు

వాఁడు. అట్టి మహాత్ముని నా భర్త నిండుసభలో ననేక విధముల గౌరవించి భూషించు చుండునఁట. అట్లు చేయుటొక గొప్పగాదు. ఎందువలన ననఁగా నా భర్త సామాన్య పురుషుఁడు గాఁడు. మంచి విద్వాంసుఁడు. కనుకనే కవిశిఖామణి యగు కాళిదాసుని స్తుతించుట. ఉత్తములకే యుత్తముల గుణములు దెలియును. విద్వాంసులకే విద్య యొక్క విలువ దెలియును. అలాగే నా భర్త కాళిదాసు యొక్క కవిత్వమును బలుమాఱు పొగడుచుండునఁట. అందఱకు లక్షయిచ్చినఁ గాళిదాసునకు రెండు లక్షలిచ్చునఁట. దీనివలనఁ బండిత జనుల కందఱకును మిక్కిలి యీర్ష్య కలిగినదని నా భర్త చెప్పట వినియున్నాను. అదియుఁగాక కాళిదాసు నిటీవల కవి బృందమున కంతకు రాజుగఁ జేసినట్లునుఁ జెప్పెను. అట్లు కాళిదాసుని రాజుగ నియమించి నందునఁ బండితులందఱుఁ జాల గోల పెట్టి 'వీఁడు మాత్రమేమి మనకంటె గొప్పవాఁడా?' అని చాలఁ గోపముతో నున్నారనియుఁ జెప్పెను.

అందువలనఁ గాళిదాసు నూరు వెడలగొట్టవలయునని తలఁచి యేవిధమున నీలుగాక నామీఁద నిందమోపిన వారికి మిక్కిలి యనుకూలమని తలఁచి యిట్లు చేసియుందురు. అంతియ గాని యిది నా భర్త తప్పుగాదు. ముమ్మాటికిఁగాదు. నమ్ముము. నిజము నిడివి మీఁదఁ బయలువడును" అని చెప్పెను.

చదువరులారా, స్త్రీల గుణమునకును, పురుషుల గుణమునకు నున్న భేదముఁ జూఁచితిరా. కాళిదాసుని విరోధు లీతీరునఁ జేసిరేమో యని రాజు తలఁపక పోయెను. ఆమె యెంత చక్కఁగా యోచించెను. ఎప్పటికిని స్త్రీల కాలోచన యెక్కువ. కనుకనే స్త్రీలకు మంచి విద్యనేర్పి వారిని మంచి దారికిఁ దేవలయును. అప్పుడు దేశము మంచి స్థితికి వచ్చును. ఇంతమాత్రము రాజాలోచించి యుండిన నెంత చక్కగా నుండును.

ఇందువలన స్త్రీలెక్కువ బుద్ధి సూక్ష్మత గలవారనియుఁ బురుషులకుఁ దగుపాటి గుణవికాస ముండదనియుఁ దెలియుచున్నది. పూర్వ మెందఱు స్త్రీరత్నములు రాజ్య పరిపాలనముఁ జేసి పురుషులవలెనే తమ దేశము కొఱకునుఁ బ్రజల కొఱకును శరీరమునుఁ బాసి వీరస్వర్గమునుఁ బొంది యున్నారు. అయిన నటువంటి గుణమణులగు స్త్రీ లీకాలమున నరుదు. ఎందువలన ననఁగా, మూఢులగు తల్లిదండ్రులు తమ కొమార్తెలకు విద్య నేర్పనందునను, నోర్వలేని పురుషులు స్త్రీల యొక్క గుణములను వికసింపకుండ నణఁచి, వారలకుఁ దగిన విద్యనేర్పక, వారలను స్వేచ్ఛగా వదలక, స్వతంత్రము వలనఁ జెడిపోవుదు రని చెప్పుచు వారి నడఁగఁ ద్రొక్కియుంచి, వారియొక్క ధీవికసనమునఁ గలుగు పరిమళమునుఁ గప్పిపెట్టి

నందునను స్త్రీలంద ఱటువంటి వారని చెప్పుటకు నోచమైతిమి. పురుషులును స్వయం కృతాపరాధ మనుభవించ వలసి వచ్చెను.

తల్లి విద్యావతియైన బిడ్డలకుఁ జక్కఁగా విద్యవచ్చును. తల్లియే బిడ్డ గుణములకు ముఖ్యకారణము. గర్భములో నున్నపుడే తల్లి గుణములు బిడ్డలకుఁ బట్టునడును. తరువాత విద్యావతియైన తల్లి బిడ్డలకుశ్రద్ధతో విద్యనేర్పును. నేర్చుకొనునట్లు చేయును. విద్యాధికులగు స్త్రీ పురుషుల చరిత్రలను బోధించును. విద్య గలవారికిని లేనివారికిని గల భేదముఁ దెలుపును. వారియొక్కయు వీరి యొక్కయు మంచి చెడుగులను జూపుచుఁ జదువుకొనునటుల వారలఁ బురికొల్పును.

విద్యలేని తల్లియో, తండ్రి కుమారుని విద్యవిషయమై శిక్ష సేయునపు డడ్డముపోయి "మీరు వాని నీవిధమున శిక్షింపకూఁడు. విద్య రానియెడల వాని పీడే పోయినది. విద్య, విద్య యని విద్య వచ్చులోపల వాని ప్రాణము పోవునట్లున్నది. పాడువిద్య రాకపోయిన వాఁడేమి చేయును" అని వానిని దీసికొని పోయి తండ్రికిఁ గనఁబడనీక దాఁచియుంచి యన్నము పెట్టి వాఁడు విద్యలేక చెడిపోవుటకు మార్గముఁ జూపును. చివరకుఁ బెద్దవాఁడైన తరువాత తనకుఁ జిన్నతన

మునఁ దండ్రిచేసిన కీడును దల్లిచేసిన మేలును బొందుచుఁ దనభార్యకు, బిడ్డకు విద్యనేర్పవలయు ననెడి యవసరము తెలియకయే కాలము గడుపుచుండును.

ఇట్లే మన దేశములోని పురుషులును స్త్రీలును తగిన విద్య గలవారు గాకపోవుటచేఁ దమ దేశమును మానమును నన్యదేశీయులపాలు గావించి పలుఁబాట్లు పడవలసి వచ్చెను. పూర్వము మనదేశ మెట్లుండెనో యని సందేహము పుట్ట నాయెను. మనమందఱము పరదేశీయులకుఁ బరిచారకులమై పొట్ట పోసికొనుచుంటిమి.

పదవ ప్రకరణము.

సూచన.

భోజమహారాజు కాళిదాసు నూరు వెడలు మని యాజ్ఞచేసి రాణికి సంగతి నెఱిఁగించి ఖిన్నుఁడై రాణివాసమునకైనఁ బోక రాణిముఖమైన వీక్షించుటకు మనసులేక, తన శయనాగారమందే యెల్లపుడు యోచించుచుఁ బరుండియుండెను. ఒక్కొక్కప్పు డెదుట నెవరుండుటయుఁ దెలియక తనలో తానే మాటాడుటయుఁ గలదు.

ఆలాగే యొకనాఁడు మంత్రి బుద్ధిసాగరుఁడు తన యెదుట నిలఁచి యుండుట తెలియక యిట్లు మాట్లాడెను.

"ఆహా! అటువంటి కవిశిఖామణిని వెడలించితిని. దేవి కీసంగతి తెలియ పఱచగా నామె యామాటలకు దుఃఖించినదికాదు. నేను సంగతి యెఱిగినందుకు ముఖమున భయము తోఁపలేదు. మఱియు నన్నుఁ బొగడినది. ఎన్ని జన్మములకైనను నేనే భర్త కావలెనని కోరినది. పూర్వకృత మనినదే గాని నాపై నెంతమాత్రి మలిగినదికాదు. ఇదంతయుఁ జూడఁగా నామె యం దెంతమాత్రిము కలుషము తోఁచదాయెను.

" కాళిదాసు డిప్పు డెచ్చట నున్నాఁడో తెలియదు. ఇది నిజమైనచోఁ దాఁ జేసిన కార్యమునకు ఫలమని తలఁచును. లేనియెడల నన్నెంత దూషించునో? అదియుఁ గాక యట్టి మహాత్ముని వెడలించినందులకు నాకెంత పాపము రానున్నదో? ఆహా! నా కెటువంటి యిక్కట్టు వాటిల్లినది. అనిత్యసంతుష్టురాలగు నాయర్ధాంగిని, కవిరాజగు కాళిదాసుని విరోధులఁ జేసికొనవలసి వచ్చె. ఏమానవునకైన భూలోకమున నింతటి కష్టము వచ్చునా?

"ఏమాశ్చర్యము! నేనేల యింత బేలనై యిట్లు విలపింప వలయును? ఇప్పుడీ యిరువురి సంగతి యనృతమని తలఁచుట కేదైన నిదర్శన మున్నదా? లేదు. తరంగవతి నిద్రలో నావిధముగఁ గలవరించుట యబద్ధమని చెప్పుటకు వీలులేదు. ఒకటికి రెండుమారులు కలువరించినది. అది యెంత స్పష్టముగ మాట్లాడినది. కాళిదాసుని దూషించినది. తరువాత రాణికి బుద్ధి చెప్పినది. ఇది యంతయుఁ బొరపాటా? ఏమాత్రముఁ గాదు. కలువరింతలో నబద్ధముండదు. మనస్సులో నున్నదే, పగలు జరిగినదే నిద్రిలోఁ గలువరింత యగును. అదియు సందేహమని పరీక్షింపఁ దలఁచియుండి యిరువుర నొకచోటఁ జూచితిని. ఆహా! అది తలచిన నింకను నామనస్సు మిక్కిలి పరితాపము పొలగుచున్నది. నాసమక్షమునను మహారాణి యున్నదనిగాని నేనున్నానని గాని తలఁపక యంత శృంగారముగ వర్ణించుట, అకులపాతకి, వంశద్రోహిని యది విని సంతోషించుట; నే నసౌఖ్యముగ నున్నానని తలఁపక నవ్వుట; ఇంకను సందేహమా? ఏనాఁటికిఁ గాదు" అని పరిపరివిధములఁ దలపోయుచుండెను.

అప్పుడు చెంతనున్న బుద్ధిసాగరుఁడు రాజుయొక్క విచారమంతయుఁ జూచుచుండి యింక నూరకుండఁ గూడదని తలఁచి "మహారాజా, ఏల మీరింత విచారము పొలైతిరి. మీ సేవకుఁడు తెలిసికొన గోరుచున్నాఁడు." అని మిక్కిలి వినయముతో నడుగఁగా భోజమహారాజు " మంత్రీ, ఏమని చెప్పు మనెదవు? నాకీ లోకమున నున్న సంతోషము రెండు విధములు. రాణివాసమున నాయర్ధాంగలక్ష్మియైన లీలావతి వలన; సభకువచ్చినఁ గవిశిఖామణియగు కాళిదాసుని వలన;

ఇవిరెండే; వీరిరువురే నాకు దూరస్థులైరి. నాకు గర్భశత్రులైరి. ఇంక నే నేవిధమున జీవింపఁగలను?" అని చెప్పెను.

అప్పుడు బుద్ధిసాగరుఁడు "దేవా, మీకుఁ జెప్పునంతటి వాఁడను గాను. అయిన నిదంతయు నమ్మఁదగినది కాదు. పండితజనుల దుష్ప్రేరణ యనియు, కవిని వెడలింప నిటులఁ జేసి యుందురనియు నాకుఁ దోఁచుచున్నది. మహాత్మా, నే నిప్పుడు మీతో నొక ముఖ్యమైన సంగతి నెఱిఁగింప వచ్చితిని. అదే దనఁగా, మహారాణి లీలావతీదేవి యగ్ని ప్రవేశమునకై తొందఱ చేయుచున్నది. నే నెంత చెప్పినను వినక 'అన్నా, నీవుత్వరగా నాకగ్ని సన్నాహము చేయుము. ఈ యపకీర్తి నేను మోపలేను. నాశీలము నా భర్త యెఱిఁగినను లోక మెఱుఁగదు. సీతాసతీమతల్లియొక్క పాతివ్రత్యము రాముఁ డెఱిఁగియు నగ్నిప్రవేశమునకు నొప్పుకొన్నట్లు నా భర్తయు దీనికి సమ్మతించును. నేను నాపతియే దైవమని నమ్మియుండిన నగ్ని నన్నేమి చేయగలఁడు? అగ్నిదేవుఁడు నాకు సహోదరుఁడే. అదియుఁగాక యాకాశవాణి నాపాతివ్రత్యమును వెలిబుచ్చును.' అని యామె పట్టు వట్టియున్నది. మీ యిష్టమున కెదురు చూచు చున్నాడను." అని చెప్పిన మంత్రి మాటలకు భోజమహారాజు "మంత్రీ, అదియే నాకుఁ బరమ సమ్మతము. త్వరలో నాలాగు చేయు" మనెను. వెంటనే బుద్ధిసాగరుఁడు తనపని నెఱవేర్చుటకై పోయెను.

పదకొండవ ప్రకరణము.

దాది చెప్పిన కథ.

సూర్యుఁడు వెడలి పోయినందుననో, లేక లోకమాతవలె నున్న లీలావతీదేవికి వచ్చిన కష్టముల రూపమో, లేక భోజమహారాజు సభ నలంకరించు తేజశ్శాలియగు కాళిదాసు వెడలిపోయి నందునఁ గలిగిన యంధకారమో గాని లోకమంతయు దట్టమైన చీఁకటి యావరించి మిక్కిలి విచారము దోఁపఁజేయు చుండెను. అట్టి సమయమున ధారానగర రాజ్యలక్ష్మియగు లీలావతీదేవి మిగుల విచారముతో నుసురుసురని భరించలేని సంతాపమునఁ గుందుచుండెను. దాసీజను లెందఱో చుట్టుమూగి యెన్నోవిధముల సేదదేర్చు చుండిరిగాని, యామె మాత్రము "చెలీ, ఎప్పుడు తెల్లవాఱునే? ఎప్పుడు నామనోవిచారము తీఱునే?" యనుచుఁ దఱఁగని చింతతో నిట్టూర్పులు పుచ్చుచు పానుపుపైఁ బొరలాడు చుండెను.

అప్పుడు తల్లివలెఁ జూచుచుండు పెద్దదాది లీలావతి దగ్గఱకు వచ్చి, "ధారానగరాధీశ్వరీ, భోజమహారాజ్ఞీ, ఏల నీవిట్టి విచారబడబాగ్నిజ్వాలల కాహుతి యయ్యెదవు? నీవంటి పతివ్రతకు నిట్లేఁగలిగిన యపవాదమునుఁ గూర్చిన యొక పూర్వ కథ చెప్పెద వినుము.

ప్రపంచమున భూలోకనాక మనదగు విశాలనగరము చుట్టుప్రాకారములు గలిగి విశాలమైన వీధులతోను, నెత్తైన మేడలతోను, చూచుటకు మిక్కిలి యలంకారముగా నింపు గులుకు చుండెను. అట్టి రాజ్యమును నందుఁడను రాజు పాలించు చుండెను.

ఆమహారాజు, పతివ్రతయగు భానుమతియను భార్యయు, శారదానందుఁడను గురువును, బహుశ్రుతుండను ప్రధాన మంత్రియుఁ గలిగి మిక్కిలి ప్రకాశమానుఁడై యుండెను.

అయిన నామహారాజు భానుమతిపై మోహమనెడి పాశముచేఁ గట్టఁబడిన వాఁడై యొక్కనిమిషమైన నామె నెడఁబాయలేక సభకు వచ్చుటే మానివేసెను. మిక్కిల బుద్ధిమంతుఁడగు బహుశ్రుతుండు రాజు కంటె వేయిరెట్లు చక్కగా రాజ్యమునుఁ బరిపాలించుచు రాజు సభకురాని కొఱంత నేమాత్రము ప్రజలకుఁ దోఁపనీక నడపుచుఁ గడు జాగరూకతతో మెలఁగు చుండెను. బుద్ధి కుశలులైన మంత్రులు గల రాజుల కేకొఱంతయుఁ గలుగదు.

కలుఁగ కున్నను మంత్రి యిట్లాలోచింప మొదలు పెట్టెను. „ఈ రాజేమో దేవి మోహమందు మునిఁగి ఎప్పు పాటుకాల మైనను సభకు వచ్చుటలేదు. ప్రజలకు రాజెటు వంటి వాఁడో చూచుటకైనఁ గనఁబడఁడు. ఇట్లేగదా బుద్ధి

హీనులు కామమునఁ జిక్కి మడియుదురు. జూదమాడువారు, కల్లు త్రాగువారు, స్త్రీలోలులు, వీరందఱు వేఱుచింత యెఱుఁగరు. గుణవంతుఁడగురాజన్ని విషయముల యందును యథాప్రీతుఁడైఁ యుండును. ప్రజలను బిడ్డలవలెఁ బోషించును. ఈమహారా జొకనిమిషమాత్రము సింహాసన మధిష్ఠించినఁ జాలును. రాజ్యాంగవిషయము లన్నిటిని నేనే చూడఁగలను. రాజు సభకు వచ్చుచున్నాఁ డనిపించినఁ జాలును. మంత్రులు సేనాధిపతులు మొదలగువారు రాజును జూచి యుత్సాహవంతు లగుదురు. అట్లు గాక రాజనియమముల నే నియమించిన వారి తలకెక్కునా? 'వీఁడేమి? రాజా? వీఁడు చెప్పిన మాటతో నేమిపని?' యని యందురు. మనవలెనే యెందఱో రాజులు సమయము నిరీక్షింతురు. బలవంతులు బలహీనుల నెప్పుడుఁ దఱుమఁ జూతురు. తల్లి దగ్గఱఁదీసి ముద్దిడి యాక లెఱిఁగి పాలిచ్చుట వలనఁ గదా బిడ్డలకుఁ బ్రీతి. ఆలాగే రాజు ప్రజల మొఱ లాలకించి కష్టసుఖములఁ గనిపెట్టక పోయిన నాతనియెడలఁ బ్రీతి వారి కెట్లు గలుగును? మన మీఁదికిఁ బరరాజులు వచ్చినప్పటికిఁ దోడుపడువా రెవరు? కాఁబట్టి యెటులైన నీరాజు సభకు వచ్చునట్లు చేసెదను.,,

అని యోచించి, యొకనాఁ డుచితసమయ మరసి, రాజును సమీపించి, వందనం బాచరించి „స్వామీ, విన్నపమా

లింపవలయును. మీరిట్లు చిరకాలము సభకు రాక రాజ్యాంగ విషయములఁ జూడకుండుట సమంజసముగ నుండలేదు. మీరు కొంతకాలమైనను సింహాసన మధిష్ఠించి జనుల మనవులఁ గైకొని సేవకుల కాజ్ఞాపించి వెళ్లినఁ జాలును. తక్కిన దంతయు నేను జూచుకొన సిద్ధముగ నున్నాను. అట్లుగాక మీరు చిరకాల మీవిధమునఁ గొలువునకు రానియెడల నీసంగతి మన శత్రురాజులు గ్రహించినఁ దప్పక మనపైకి రాక మానరు. వచ్చినప్పుడు వారల నెదిరించుటకు మన సైన్యమున కుత్సాహ ముండదు. నా మనవిఁ జిత్తగింపుఁడు. దేవా, యెట్లయినను గొలువుకూటమునకు దేవర విచ్చేయు నేర్పాటుఁ గావించి నన్ను ధన్యునిఁ జేయుఁడు." అని మంత్రి వేఁడుకొనెను.

ఆమాటలకు రాజు తనలో నిట్లు దలపోసికొనెను. "నామనోహారిణి చేయి పట్టుకొని యొక క్షణము నిలుచుండెనేని శ్రీమహాలక్ష్మి తాండవ మాడి నట్లుండును. అట్లనే యొక గంటసేపు నన్నే చూచుచు నిలిఁచెనేని యిఁకఁ జెప్పవలసినదే లేదు. ఈరేడులోకము లేకచ్ఛత్రముగ నేలినట్లే యుండును. అహా! ఆయింతి నన్నుఁ గౌఁగిలించెనా నాకు దేవేంద్రభోగమే యనవసరము. ఆలలనతోడిదే సంసారసుఖము. అమగువ కూటమితొలిజన్మ, ఫలము. మనోనాయిక యైన నాయ

ద్ధాంగలక్ష్మితో రాజ్యలక్ష్మి సాటియగునా? మెఱుపుఁదీఁగతో సమానమైన శరీరకాంతిఁగల నాకామినీరత్నమునుఁ బాసి యుండగలనా? ఉండలేను. మొగమోటమితోఁ బని లేదు. ఈరాజ్యము పోయినను నాకుఁ జింతలేదు." అని యనుకొని యమాత్యుఁగాంచి, "మంత్రీ, ఏమని చెప్పుదును? నా బహిఃప్రాణమగు దేవిని విడిచి యొంటిగఁ గొలువునకు రాలేను. అట్లని దేవిని సభకుఁ దెచ్చుట యనుచితము. నా తన్వంగినిఁ బాసి వచ్చిన నాప్రాణములు నన్నుఁ బాయుట నిశ్చయము. నా దేవి ముఖముఁ జూడని యొక్కనిముస మొక దినముగఁ దోఁచు, గడియ యేఁడగు, పగలు మహాయుగము, రాత్రి బ్రహ్మకల్పమే. వేయిమాట లేల? మంత్రీ, నేను భానుమతినిఁ బాసి యొకనిముసమైన నుండలేను. నీవిచారమును మానుము. ఏమైనను సరే. దేవునిదే భారము." అని ముగించెను.

పండ్రెండవ ప్రకరణము.

ఉపాయ మపాయమగుట.

ఈసంగతు లన్నియుఁ జక్కఁగా నాలోచించి మార్గ మరసిన బహుశ్రుతుండు, "మహారాజా, మీరు దేవి నెడఁ బాయలేకేని నే నొక్క యుపాయముఁ జెప్పెద నాలకింపుము.

చిత్రకారు నొకని బ్రహ్మకుఁ బ్రతిగా వ్రాయువానిని బిలిపించెదను. వాఁడు భానుమతీదేవిగారిపటము వ్రాయును. ఆపటమును సభకుఁ దెచ్చి వీక్షించుచు నొక్కముహూర్తకాలము సభ నలంకరింపుఁడు. మీదర్శనమాత్రముననే నేఁ బను లన్నిటినిఁ జేసెదను. సెల వీయఁ బ్రార్థించెద." నని వేఁడుకొనఁగా సరియని యొప్పుకొనెను.

అంతట మంత్రి మహాసంతోషమున మిక్కిలిచతురుఁడగుముచ్చువానిం బిలిపించి భానుమతీదేవిని జూపింపఁగా నాతఁడునుఁ గడునేర్పుతో నచ్చముగ దేవింబోలిన చక్కని చిత్తరువును వ్రాసెను. ఆపటమును రాజు చూచినతోడనే రాణియని భ్రమించి యాపటమును గౌఁగలించుకొని చేష్టలుడిగి తానును జిత్తరు వాయెను. కొంతసేపటి కది పటముగాని దేవి కాదని దృఢపడఁగా నాశ్చర్యముతోఁ దాను చేసినపనికి సిగ్గుపడి దగ్గఱనున్న శిల్పి యేమి తలఁచెనో యని లోలోనఁ గుందుచుఁ “చిత్రకారుఁడా, చాల బాగుగ వ్రాసితివి. మిక్కిలి చక్కగా నున్నది. దీని నాగురువగు శారదానందునికిఁ జూపి రమ్ము. ఇంత మనోహరముగ నున్నపటముఁ దప్పక నాయనకుఁ జూపవలయు" నని చెప్పెను.

అప్పు డాచిత్రకారుఁడు రాజాజ్ఞమేరకు శారదానందుని గృహమునకుఁ బోయి భానుమతీదేవిపటము నాతనికిఁ జూపెను.

దానిం గాంచి శారదానందుఁడు మిగుల నాశ్చర్యపడి “ఆహా చాల బాగుఁగ నున్నది. అచ్చముగ భానుమతినిఁ బోలి యున్నది. ఈపటమును జూచిన నామెను జూడ నవసర ముండదు. అయిన నామె లోఁదొడయం దొకపుట్టుమచ్చ యుండవలెను. అది యింద్రనీలకాంతితో నిగనిగ లాడుచుండును. కనుక దానిని వ్రాసి యీపటముయొక్క కొఱఁతఁ దీర్పు" మన నాచిత్రకారుఁడును, నామచ్చను గస్తురితో గురువు చెప్పినట్లుఁ గడునేర్పుతో వ్రాసి చూపెను. “సరిగా నున్నది. ఇఁక నామెను బోలుటకే కొఱఁతయు లే" దని గురుఁడు చెప్పెను. తరువాత గురునొద్ద సెలవుఁ గైకొని రాజుకడకు వచ్చి చిత్రకారుఁడు శారదానందగురుగృహమున జరిగిన సంగతు లన్నియుఁ బూసగ్రుచ్చినట్లు సవిస్తారముగా విన్నవించి పటముఁ జూపెను.

ఆసంగతులు విని యాపటమును వీక్షించినతోడనే శరీరమంతయుఁ జెమ్మట లంకురింప రాజు వడఁకిపోయెను. ఎంతో తడవు యోచించెను. కాని దేవితొడయందలి మచ్చను దా నెప్పుడుఁ జూచినజ్ఞాపకము లేదు. చిత్రకారునికి సెల వొసఁగి త్వరగా నంతఃపురమునకుఁ బోయి యేకాంతమునఁ దన కాంతఁ బరీక్షింపఁగా నామెతొడమచ్చ గనఁబడెను. అంతట మహారాజునకు నారాట మెక్కు డయ్యెను. మనస్సు తామ

రాకులోని నీటిచందమ్మునఁ జలనమొంద నాతఁడు తాళలేక మూర్ఛవోయెను.

కొంతవడికి చెంతనున్న దేవి చేయు శైత్యోపచారముల చేత రాజు సేదఁదేరి యిట్లు లాలోచింప మొదలిడెను. "ఆహా! నాయంతయవివేకి యుండునా? అంతఃపురములోనికిఁ బోతుటీఁగఁ గాని దోమఁ గాని బోనీయక కట్టడ చేసితిని గాని పాపాత్ముని, స్వామిద్రోహిని, శారదానందున కడ్డు చెప్పనైతిని. మహాతపశ్శాలులై పవనపర్ణాంబుభక్షులై యినుపకచ్చడముల ధరించి యుండుమునులు సహితము స్త్రీలకు వశ్యులు. పురుషుడు వశిష్ఠుఁడైనను స్త్రీ సీత యయినను నిరువురు నేకాంతముగ సంధించినఁ బ్రొయ్యిగడ్డపై నుంచిన వెన్నపగిదిఁ గరఁగుదు రనుసామెత నిక్కము. నాగురు వగుశారదానందుఁడు మాత్రము మగవాఁడు కాఁడా? ఏవేళ కెవ్వాని మన సెట్లుండునో యెవ్వ రెఱుఁగుదురు? ఇది యంతయు నాబుద్ధిపూర్వకమైనతప్పే. నిరాటంకముగ నేను నాసతియొద్ద నున్నపుడు సహితము గురువుగదా యని రానిచ్చినందునఁ గలిగిన శాస్తి యిది. వీ డింతమోసము చేయునని కలనైనఁ దలఁపనైతిని. ఈనీచున కింత పొగరా? ఇంతటి క్రూరకార్యముఁ జేసియుండియు భయపడక తన యకార్యకరణమును వెలిపుచ్చినాఁడు. ఇందువలనఁ జిత్రకారుఁ డేమితలఁచెనో? రాజునకుఁ

డెలియని తొడమచ్చ గురువు చెప్పినాఁ డనిన నెంతయప్రతిష్ఠ? తప్పక వీనిని సంహరించి నావంశమునకుఁ గలిఁగినకళంకమును బాపుకొనెదను. వీఁడు వధార్హుఁడు. వీనిం జంపినఁగాని నా మనస్సంతాపము దీఱదు. నాకులసతినిఁ బొందినద్రోహి నిప్పుడే సంహరించెద" నని యనేకవిధములఁ దలపోసి మంత్రియగు బహుశ్రుతుని బిలిపించిసంగతి యంతయుఁ దెలియఁజేసి గురువును గొనిపోయి ఘోరారణ్యమునఁ బరిమార్పించి రమ్మని సెల విచ్చెను.

ఆమాటలు చెవులఁ బడఁగానే మంత్రి గజగజ వడఁకి మిక్కిలి విచారముతోఁ "ప్రభూ, గురువును జంపు మనెదరు. పూర్వము భారతయుద్ధమందు బిడ్డలఁజంపిన యశ్వత్థామకై శ్రీకృష్ణమూర్తి "బ్రాహ్మణోనహన్తవ్య" యని చెప్పియున్నాఁడు. కాఁబట్టి కులగురువును బ్రాహ్మణుఁడును నగు శారదానందుఁ జంపు టె"ట్లని విన్నవించెను.

రా జామాటలకు మహారోషముతో దెబ్బతినిన పామురీతిఁ బండ్లు పటపటఁ గొఱుకుచుఁ గన్నుల నగ్నికణములు రాల మంత్రి నీక్షించి "ఆదుశ్శీలుఁడు చేసినపని నీకుఁ గర్తవ్యమని తోఁచినది కాఁబోలు? నాయవమానముఁ జూడవైతివి. ఇప్పుడు నేఁ జెప్పినట్లు చేయ వేని యిప్పుడే నేను నిన్నికత్తి కెరఁజేసి తరువాత నీయొక్క వేదవాక్యము నాలకించెదను.

గుఱ్ఱము వచ్చి పిల్లను బెదిరించె నన్నట్లు నీవా నాకు నీతిఁ గఱపెడివాఁడవు?" అని యనుచుండగనే తెలిసియుఁ దెలియనివారలకుఁ జెప్పుట యసాధ్య మని తలఁచి గుణవంతుఁడగు బహుశ్రుతుండు దిగ్గున లేచి 'దేవర చిత్తానుసార మొదర్చెద' నని సెలవు గైకొనెను.

అట్లు రాజాజ్ఞానుసారముగ గురువునుఁ బెడతెక్కలు విఱిచికట్టించి పురజను లందఱు 'నింతటియకార్యము గూడఁ గలదా?' యని విచారించుచుండ వధ్యస్థానమునకుఁ గొనిపోయెను.

పదమూడవ ప్రకరణము.

రాజకుమారుని వేఁట.

ఇట్లు జరిగిన కొంతకాలమునకు విశాలనగరమునకు సుమారు పది క్రోసుల దూరమున నుండు నడవికి వేఁటాడుటకై నందవిభుని కుమారుఁ డగు విజయపాలుఁడు బయలు దేఱెను. వాఁడు మిక్కిలి తుంటరి. ఎవ్వరికిని మేలుచేయువాఁడు కాఁడు. దుస్స్వభావము గలవాఁడు. ఇట్టి యారాచకుమారుఁడు తనకు సమానులైన చెలికాండ్రఁ గూడుకొని మంచిమంచిగుఱ్ఱముల నాయత్తము చేసికొని యడవిఁ బ్రవేశించెను.

ఆయడవియందుఁ బెద్దపెద్దయెత్తైన చెట్లు దట్టముగాఁ బెరిగి యక్కడక్కడ తీగ లల్లిబిల్లిగా నల్లుకొన నది ఘోరమృగములగు పెద్దపులులకును, సింహములకును, బుట్టినిల్లై యనేక క్రూరమృగములకు నాటపట్టై, మిక్కిలి భయంకరముగ నుండెను. ఆయరణ్యమునకును, విశాలనగరమునకును, బదిక్రోసుల దూర ముండుటచే నామృగములవలనఁ బట్టణమునకేమాత్ర మిబ్బందిగాని భయముగాని లేకుండెను. అయిననుఁ జెడ్డవారి కెప్పుడును నొకరికిఁ జెఱుపు చేయుటయే పని. అట్లే యాదుష్టుఁ డగు రాజకుమారుఁడు తమపట్టణమున కేమాత్రము హానిఁ గలుగఁజేయని మృగములను వేఁటాడుటకు నిశ్చయించెను.

అట్లు సనిన వీరందఱును జాలసేపు వేఁటాడిరి. అప్పుడు నీలమేఘవర్ణము గలిగి కుఱుచకొమ్ములతో నెత్తైనదీర్ఘదేహముతోఁ దుండము లేనికరిభంగి నడవియంతయుఁ గంపించునట్లు బొబ్బలిడు నొక్కవరాహము వీరికిఁ గానవచ్చెను. దానిఁ జూచినంతనే తనగుఱ్ఱమునుఁ దఱుముకొనుచు రాజకుమారుఁడు చాలదూరము వెంబడించెను. అది యొక్కమాఱు కనఁబడి మఱియొక్కమాఱు కనఁబడక, యింకొకమాఱొత్తుగ నల్లుకొనియుండుపొదల డాగుచుఁ బోవుచుండెను. ఆవరాహముమీఁదనే ధ్యానమంతయు నుంచిన యారాజకు

మారుఁడు దాని నదల్చుచునే కడు దవ్వేగి తుద కది యెట వోయెనో దానిజాడయే కనుఁగొనలేకపోయెను.

అప్పుడు రాజకుమారునికిఁ దాను తనసహచరులఁ బరిజనుల విడిచి యొంటరిగ నెంతదూరము వచ్చినదియుఁ దెలిసెను. విజయపాలుఁ డేమిచేయుటకుఁ దోఁచక దిక్కులు చూడసాగెను. గుఱ్ఱమునుఁ దానునుఁ జాల నలసి యుండిరి. దాహము మిక్కుటముగా నుండెను. అచ్చట నెచ్చటనైన నీళ్లున్నవా యని రాకుమారుఁడు వెదకుచుఁ బోవపోవ ముందఱ నొక్క చక్కనిసరోవరమును దానిచేరువనే పెద్దయూడలచేవిలసిల్లు నొకవటవృక్షమునుఁ గనఁబడెను. రాచకుమారుఁడును గుఱ్ఱమును దిగి యా సరోవరమునందుఁ గాళ్లుచేతులు ముఖమునుఁ గడుగుకొన్నవాఁడై మంచినీరు త్రాగి గుఱ్ఱమునకు నీరు వట్టి మఱ్ఱిచెట్టునకుఁ గట్టి తానును మందమారుతము వీచుచుండగాఁ గొంతవడి సేదఁదేరి వెళ్లవచ్చునని యచ్చటనే విశ్రమించెను.

అప్పుడు సర్వజనభయంకరమైన యొక్కశార్దూలము చెంత పొదలదాపునుండి చెంగున దాటి రాజకుమారుని ముందు నిలఁచెను. దానిఁ జూచి చెట్టునకుఁ గట్టియున్న గుఱ్ఱము బలముగ లాగి కట్టు త్రెంచుకొని వచ్చినత్రోవఁ బట్టి పరుగెత్తెను. క్రూరమృగముల వధించుటకై వచ్చిన

శూరుఁడగు రాజకుమారుఁ డేమిచేయుటకుఁ దోఁచక పూర్వపుణ్యవశమున నొక్కయూహ స్ఫురింపగాఁ దన చెంతనున్న చెట్టు నెక్కసాగెను.

అంత నాపుండరీకము దండతాడితభుజంగమురీతిఁ దోక నాడించుచు వాడియైనకోఱలు గనబడునట్లు నోరంతయుఁ దెఱచి బొబ్బలిడుచుఁ గన్నులఁ గోప మనెడియగ్ని కణములు రాలఁ బైకిఁ జూచుచు మ్రానిపై కెగుర నుంకించుచుఁ జెట్టుక్రింద నిటునటుఁ దిరుగుచుండెను.

అట్టిసమయమునఁ జెట్టునెక్కుచున్న విజయపాలుఁడు పైకిఁ జూచెను. చూచినతోడనే కన్నులు తిరిగి క్రింద పడఁబోయెను. ఎందుచేత ననఁగా శాఖయందుఁ గూర్చున్న భల్లూక మొకటి యాతని కంటఁ బడెను. ముందు నుయ్యి వెనుక గొయ్యి యున్నట్లు చేయునది లేక గజగజ వణకి 'క్రింద దిగిన పులి మ్రింగున ట్లున్నది, పైకిఁ బోయిన నెలుఁగుగొడ్డు భక్షించున ట్లున్నది. ఏమి చేయుదు' నని నిశ్చేష్టుఁడై నిలుచుండెను.

అట్టిస్థితియం దున్న రాకుమారునిఁ జూచి వృద్ధభల్లూకము కరుణతోఁ గూడిన మనుష్యభాషతో "రాజపుత్త్రుఁడా, వెఱవకుము. పులిచేతఁ దరుమఁబడి నా చెట్టెక్కి ప్రాణరక్షణఁ గావించుకోఁ దలఁచితివి. కనుక తప్పక నీవు రక్షణీయుఁడవు. ఇట్టిసమయమున నిన్ను గావనినాజన్మ మెందులకు? ఏమార్గ

మును లేక భీతిచేఁ జింతించు నీవంటిదీనుని వధింప నెట్టి క్రూరులు సమకట్టుదురు? నాయదియుఁ గ్రూరమృగజాతియే. నేనును నీయట్టివారి నెందరినో వధియించి యున్నాను. అయిన నిప్పుడు నీ వాప్తుఁడవు నతిథియు నయితివి కనుక నేను నీ కభయహస్త మొసఁగుచున్నాను. నీభయముతోఁ గూడిన చింతను మాని నావద్దకు రమ్ము” అని రాజకుమారుని భయముఁ దీర్చి దగ్గరకుఁ దీసి తాను భక్షించు నన్యఫలములచేతను, దుంపలచేతను నతిథిసత్కార మొనర్చి యాఁకలిఁ దీర్చి తన యొద్ద నుంచుకొనెను.

పదునాలుగవ ప్రకరణము.

దుష్టులకు మేలు చేయుట కీడుకొఱకే.

పడమటి సీమయం దున్న తన ప్రియురాలినిఁ గూడు నాతురతతో సూర్యుఁడు తన యలసిన గుఱ్ఱములను దోలుకొనుచు మిక్కిలి త్వరితముగ పశ్చిమసముద్ర తీరమునకుఁ బోయి గుఱ్ఱములవిప్పి సేదఁదేరుటకై విడిచి సతీసమేతుఁడై తానును సముద్రతీరపు చల్లగాలికి విహరించు చుండెను. అట్టి సమయమున నాతని ప్రియకాంత కట్టియుండు మందారపు కోకరంగో యన నపరదిశ నాకాశమంతయు నెఱ్ఱగానుండెను. ఆపడమటి కాంత చూచుకొను పద్మరాగపు టద్దమున దినకరుని ప్రతిబింబము గనఁబడు చుండెను.

కమలము లన్నియుఁ దమకాంతుఁడు పాసిపోయినందున నాతనియెడఁబాటున కోర్వనివై ముఖముల ముడుచుకొని కదలక తపస్సుఁ జేయుచున్నట్లుండెను. పక్షులు తమ మిత్రములగు కమలములకుఁ గలిగిన యెడఁబాటు నొకటితో నొకటి చెప్పుకొనుచున్నవో యనునట్లుఁ గలకలమని యఱచుచుఁ దమతమ నివాసములకుఁ బోవుచుండెను.

అట్లన్నియు వానివాని యునికిపట్టులకుఁ బోఁగా నాకాశమంతయు జ్ఞానుల హృదయమువలె నిశ్చలముగ నుండెను. ఆవిధమున గగనకాంత యలంకారహీనయై యుండుటఁ జూచి మిత్రములగు నక్షత్రము లామెనుఁ బరామర్శించుటకు వచ్చుచున్నవో యన్నట్లచ్చటచ్చటఁ బొడసూపు చుండెను.

ఆసమయమునఁ జెట్టుమీఁద భల్లూకముచెంతనున్న రాకుమారుఁడు పగలంతయు వేఁటచేత నలయుటవలనను నెలుగుబంటిని శరణుఁజొచ్చి యభయహస్తముఁ బొందినందునను, నెక్కుడు నిద్రరాఁగాఁ దూగుచుండెను. అదిజూచి జాలిఁగల యావృద్ధభల్లూకము ‘‘మిత్రుఁడా, ఏలనట్లు తూఁగెదవు? నీవు నాకు నతిథివిఁ గనుక నీవేమియు భయపడక నాయొద్దకువచ్చి నా తొడపై శిరముంచుకొని నిదురింపుము’’ అని ప్రీతితోఁ బిల్చెను.

రాజపుత్రుఁ డదివరకే నమ్మి స్నేహమువలన నతిథిసత్కారముఁ బడసినవాఁ డగుటచేత నామెలుఁగును నదియా

సించి దానియూరువుపైఁ బరుండఁ నిర్విచారముగ గాఢనిద్రఁ బోయెను.

ఇదంతయుఁ జూచుచు నాహారములేక చెట్టుక్రిందఁ గాచియున్న యా చారలమెకము “ఓభల్లూకరాజా, ఏల నీ వింత బేలవై యీరాజకుమారునిఁ గాపాడెదవు? నీవును, నేనును నొక్కజాతివారము గనుక దూరము యోచింప మన మిరువుర మొకటియే. వీఁడన్న మనవిరోధులైన మనుష్య జాతివాఁడు. అందును క్షత్రియకుమారుఁ డెప్పటికైన మన వంశమున కెగ్గుసేయువాఁడే. కావున నామాటవిని యాతని నేలఁ ద్రోచితివేని వెంటనే వాని వధించి యామాంసములో సగపాలు నీకిచ్చుటకు సిద్ధముగ నున్నాను.” అనెను.

అట్లునుడివిన యాపులి పలుకుల నాలకించి యావృద్ధ భల్లుకము “ఓశార్దూలరాజా, నీమాటలయం దసత్యమేమియు లేదు. అయినను నీవువచ్చుటఁగాంచి భయసముద్రములో మునిగినవాఁడై దరిఁగానక నన్ను శరణుఁజొచ్చినట్లు నాచెట్టు మీఁద వడఁకుచు నిలుచున్న యీరాజపుత్రునిఁ జూచి యభయమిచ్చి యతిథిసత్కారములు చేసితిని. అట్లు చేయుటచే నన్నుఁ బూర్తిగ నమ్మి నాయంకమున నిద్రించుటకు సమ్మతించి పరున్న యీసుకుమారునిఁ ద్రోయుటకంటె వేఱు విశ్వాసఘాతుకము గలదా? అహా! ఎట్టినీచులైనను నమ్మి

గాఢనిద్రలో నుండగ నిట్లు సేయుట తగునా?” అని ప్రత్యుత్తరమిచ్చెను.

అప్పుడా పుండరీకము సిగ్గుచేఁ జేయునదిలేక యాకలి కోర్వలేక చింతించుచుఁ జెట్టుక్రిందనే యుండెను. ఇట్లుండఁ గొంతసేపటికి రాకుమారుఁడు మేల్కాంచెను. పిదప నావృద్ధ భల్లూకము “ఓయువరాజా, నాకు మిక్కిలి నిద్రవచ్చుచున్నది. నీతొడపై నన్నుఁ గొంతవడిఁ బరుండనిచ్చెదవా?” యని యడుగగా రాజపుత్రుఁడును ‘కాని’ మ్మని యాఋక్షమును తన తొడపైఁ శయనింపనిచ్చెను.

అదియుఁ జక్కగా నిదురించెను. అంతఁ జెట్టుక్రింద నున్న బెబ్బులి “ఓరాచచిన్నవాఁడా, ఇదియేమివెఱ్ఱి. నీకు నేను కీడుచేయుదాననేయయినను నీవింత దృఢముగ నమ్మి దానియొక్క మోసము తెలిసికొనలేక నమ్మకముతో మెలఁగుటఁ జూడఁగా నాకు మిగుల జాలిగలుఁగుచున్నది. ఈ వృద్ధభల్లూకము చిన్నతనమునుండియు మనుష్యరక్తమే యాహారముగఁ గలజంతువు. అదియుఁగాక యందఱిని ముందుఁ జక్కఁగా నమ్మించియే తుదముట్టించును. అదియెఱుఁగక నిజమైన మిత్రమని నమ్మి తొడమీఁద నిదురఁబుచ్చితివే! అందులకు నా కాశ్చర్యవిషాదములు గలుగుచున్నవి. ఇప్పుడైన

నీవు తెలివి గలిగి యీమృగమును గ్రిందికిఁద్రోయుము. నేను దానిరక్తమాంసములతోఁ దృప్తిఁబొంది పోయెదను. నీవును నిర్విచారుఁడవై నీనగరి కరుగవచ్చు" నని హితబోధ జేయు దానివలెఁ జెప్పెను.

అవంచకపుమెకము మాటలను సంతసముతో నిజమని నమ్మిన యీరాజకుమారుఁడు, "ఏమో, యెవ్వఁడెఱుఁగును. నన్నిప్పు డాదరించి తెల్లవారగనే చంపునేమో! ఎప్పటికిని క్రూరమృగముల నమ్మఁగూడ" దని యోచించి యీవృద్ధభల్లూకమును బడఁద్రోసెను. అదియు నిజముగ నిదురించక మనుష్యజాతి నమ్మకమెంతటిదియో చూడవలయునని యుండినది గనుక వెంటనే యొకచెట్టుకొమ్మఁ బట్టుకొని తప్పించుకొని నిలఁచెను.

ఎప్పటికిని మంచివారి కాపదలు రావు. వచ్చినను తృణప్రాయములుగఁ బోవును. "కొండవలెవచ్చినది మంచువలెఁ గఱఁగిపోవును." అను సామెతప్రకారమా యెలుఁగు తప్పించుకొని కొమ్మపట్టుకొని నిలువగానే విజయపాలుని ముఖము చెప్పటకు వీలుకానంత కాంతివిహీనమై తొల్లి చెట్టెక్కినప్పటికంటె వేయిమడుంగులు ప్రాణరక్షణోపాయము లేక తెల్లఁబడిపోయెను.

అట్టిస్థితినున్న రాకుమారు నాయెలుగుఁ జూచి "రాజపుత్రా, భయపడకుము. ముందునీకు శరణమిచ్చినవాఁడను గనుక నీవెట్టివాఁడవైనను నిన్నుఁజంపను. నీగుణ మేపాటిదియో చూచుటకొఱకే నేను పరుంటిని. జాగ్రత్తగ నుండఁబట్టియే నేను తప్పించుకోఁగలిగితిని. కాఁబట్టి వెఱవకు" మని చెప్పచుండఁగనే బెబ్బులి యాశలవలె లోకమందలి చీకటి విరిసిపోయెను. విజయపాలుని ముఖము విన్ననై తెల్లఁబడిన విధముగాఁ బ్రపంచమంతయుఁ దెలుపెక్క లోకబాంధవుఁడగు సూర్యుఁ డుదయించెను. అది చూచి పెద్దపులియుఁ దానుండు చోటునకుఁ జప్పుడు కాకుండ శీఘ్రముగఁ బోయెను. తరువాత భల్లూకమును రాజపుత్రుఁడునుఁ బెద్దపులి భయమునుండి వీడి చెట్టునుండి దిగిరి.

దిగినవెనుక నావృద్ధభల్లుకము మనుష్యవాక్కుల "నో రాకుమారా, నీవు నాకొనరించిన మహోపకారమునకై యీవనమునందే "స, సే, మి, రా," యనుచు సదా తిరుగుచుందువుగాక. నీవు గావించిన పాపమంతయు దివ్యదృష్టి వలనఁ జక్కఁగ తెలిసికొనినవా రెవ్వరైన నీవు పలికెడు నాలుగక్షరములతో నాలుగు వాక్యములు చెప్పి నీగుట్టు వెలఁబుచ్చిరేని యప్పుడు నీకు శాపవిముక్తి గలుఁగు" నని చెప్పి వెడలిపోయెను.

పదునేనవ ప్రకరణము.

కుమారుని వృత్తాంతమెఱుఁగుట.

విశాలానగర పరిపాలకుఁడగు నందమహీపాలుఁడు మిక్కిలి విచారముతోఁ దన కొలువుకూటమున బహుశ్రుతుండు మొదలగు మంత్రిపరిజనులతోఁ గూర్చుండి, "అమాత్యపుంగవా, నాకుమారుఁడగు విజయపాలుఁ డేందువలననో యింకను రాకున్నవాఁడు. మనస్సు పద్మపత్రమందలి జలబిందుచందమునఁ దత్తరపడుచున్నది. ఇప్పటికి రాత్రి తొలిజాము గడచిపోయినది. నాకుమారుఁడు ప్రాణముతో నున్న నింకను రాకుండునా?" యని నిట్టూర్పునిగుడించిన బహుశ్రుతుండు లేచి వినయముగ "మహారాజా, భయపడకుఁడు. మీకుమారునికి వచ్చిన ప్రాణభయ మేమియు నుండదు. అట్లాయన కేదైన జరిగిన వెంటఁబోయిన సేవకులైన వచ్చి మనకు సంగతిఁ దెలియఁ బఱుపరా?" యనెను. సభికులందఱుఁ గళావిహీనులై యొకరిమొగ మొకరు వీక్షించుచు నూరకుండిరి.

అప్పు డొకద్వారపాలకుఁడు వచ్చి "మహాప్రభూ, ద్వారమందు కుమారరాజుగారితో నడవికిఁ బోయిన యనుచరులు మగిడివచ్చి"రని చెప్పెను. నందపాలుఁడును వర్ణించుటకు వీలులేనంత కలవరపాటుతో "మిక్కిలి త్వరగా వారల లోనికిఁ

బ్రవేశపెట్టుము, పెట్టుము" అని యఱచుచు శరీరము మఱచి యుండెను. ద్వారపాలకుఁడును 'చిత్త' మని పోయి వారలఁ గొనివచ్చెను.

నం:—ఏఁడీ, మావిజయపాలుడేఁడీ?

పరి:—మహారాజా, మేమందఱము బయలుదేరి గుఱ్ఱముల నెక్కఁబోవ కట్టెలమోపెదురయ్యెను. అప్పుడు మా కందఱకు మన సొప్పక "రాజకుమారా, ఈవేళ శకునము బాగుండలేదు. పోవుట మాకిష్టము లే" దని చెప్పితిమి. అప్పుడాతఁడు 'శకునములు, గికునములు నేను నమ్మఁజాలను. శకునములని చెప్పువారేఁ గాని చూచినవారు లేరు. కావున నే నీవేళ దుశ్శకునఫలముఁ జూడవలయును. మీరు వచ్చినను సరే రాకున్నను సరే' యని తనగుఱ్ఱ మెక్కి ప్రయాణము సాగించెను. చేయునది లేక యందఱము నశ్వముల నారోహించి భయకంపితములైన మనస్సులతో నాలు గడుగులైనఁ బెట్టక మునుపే నూనెకావడివాఁ డభిముఖుఁ డయ్యెను. దానితో మాపంచప్రాణములుఁ బైకి లేచిపోయెను. నిర్జీవప్రతిమలవలెను, నచ్చుబొమ్మలరీతిని గుఱ్ఱములమీఁద కదలక మెదలక కూర్చుండి పోవుచుండఁగా మార్జాల మొకటి మా కెదురు వచ్చెను. అప్పుడు మాహృదయ మేరీతి నుండెనో మీరే యూహింపవచ్చును. తుదకు మనోధైర్యము గలవా

రమై, 'యింక మనము తిరిగి పట్టణము చూడఁబోము. కానున్నది కాని' మ్మని పోవుచుంటిమి."

అని చెప్పుచుండ వారిమాటల కడ్డమువచ్చి "ఛీ! విజయపాలుఁ డేమయ్యె ననినఁ జెప్పక యీకథ నెవ్వరు మిమ్ములఁ జెప్పుమనిరి?" యని నందుఁడు కోపింప వారును "మహారాజా, కోపగించక సావధానముగా వినుఁడు. అట్లు మేము సంతోషము లేనివారమై యడవి చేరితిమి. తరువాత మృగములఁ దఱుముచు వేఁటాడితిమి. పిదప మాకీసంగతి జ్ఞాపకము లేక మిక్కిలి యుత్సాహము గలుఁగ మా యిచ్చవచ్చిన రీతి తలయొక వైపు వేఁటాడుచుంటిమి. అట్లు వేఁటాడి యలసి యందఱ మొకచోటఁ జేరితిమి గాని రాజకుమారుఁడు మాత్రము గనఁబడలేదు. అందులకుఁ గడువిచారముతో నడవి యంతయు సాయంకాలమువఱకు వెదకినను మన కుమారరాజుగారిజాడయే గఁనబడలేదు. ఈవార్త తమ కెఱిఁగించుటకై వచ్చుచుండఁ బట్టణము ప్రవేశించు నప్పటికి రాజకుమారుఁ డెక్కి వచ్చిన గుఱ్ఱము మాత్రము గనఁబడె." నని వారికిఁ దెలిసినసంగతి చేతులు మోడ్చి విన్నవించిరి.

నందపాలుఁ డేమిచేయుటకుఁ దోచక వచ్చినకోపమును గలిగినదుఃఖమును నడఁచుకొని "సరి, అట్లయిన మీరందఱును బయలుదేరుఁడు. నేనును వచ్చుచున్నాను. ఎన్నిరోజులైనను సరే కుమారుని వెదకకుండ పట్టణములోనికి రాఁగూడదు.

మంత్రీ, జాగరూకతతో నగరముఁ గాపాడు" మని యుత్తరువు చేసిన రాజాజ్ఞగలవా రందఱు బయలుదేరి దారిఁజూపుచు రాఁగాఁ దానును వారితోఁ గూడి కుమారుని వెదకుచు నడవికిఁ బోయెను.

పదునాఱవ ప్రకరణము.

రాజకుమారుని యున్మాదము.

ఆబుద్ధిహీనుఁడైన రాజకుమారుఁడు భల్లూకశాపముచే నున్మాదుఁడై యేమియుఁ దెలియక నిరంతరము "న, నే, మి, రా" యని తిరుగుచుండెను. కుమారుని వెదకుటకై వచ్చిన పరిజనులతో నరపతి ప్రతిగుట్టయుఁ, జెట్టును వెదకుచు వచ్చి ప్రజ్ఞలేక తిరుగుచున్న పుత్రునిఁ గనుఁగొనెను. కనిపెట్టి యేమి ప్రయోజనము? కుమారుఁ డేమిచెప్పుటకును దెలివిలేక "స, సె, మి, రా" యనుచున్నఁవాడు. కర్తవ్య మూహించి యది యొక పిచ్చియనియుఁ బట్టణమునకుఁ గొనిపోయి కుదుర్చుకొనవచ్చు ననియుఁ దలఁచి కొడుకు చిక్కెఁగదాయను సంతోషమున నగరికి నాతనిఁ దోడ్కొని పోయెను.

తరువాత నాభూకాంతుడు మంత్రులు మొదలగు వారితో నాలోచించి యాతని మనోవికారనివృత్తికై దేవతలకు మ్రొక్కి, భూదేవతల బూజించి, కులదేవతలఁ

నారాధించి, సమారాధనలు గావించి, మణిమంత్ర తంత్ర క్రియాసాధనంబులు ప్రయోగించి, నానావిధభూతములకు బలులిచ్చి, మహాదానంబులగు స్వర్ణగోభూదానంబు లమితముగఁజేసియు నేమిట ఫలముఁగానక చింతించి "నాకుమారుని వ్యాధి నెవ్వరు కుదుర్చుదురో వారికి నాయర్ధరాజ్య మిచ్చెద" నని చాటించెను. అప్పటికిని నావ్యాధిఁ గుదుర్చువారు గానఁబడరైరి. కడకు వేసారి "నాకుమారుని రుగ్మత నీలోకమున నివారణ చేయువారు లేరు నాగురువు శారదానందుఁడున్న నయముఁజేసి యుండునుగదా. ఆమహామహుని నాయవివేకమువలనఁ జంపుకొంటిని." అని యాతఁడు వాపోయెను.

పదునేడవ ప్రకరణము.

శారదానందుఁడు.

మంత్రి గురువును వధ్యస్థానమునకుఁ గొనిపోయి చంపుటకుఁ జేతులాడక యిట్లు చింతించెను. "దేవితొడయందుండు మచ్చుఁ బటమున వ్రాయుమని యాతఁ డేలఁ జెప్పవలయును. ఏపటమున కేకొఱతయున్నఁ దనకేమినష్టము? రాజులు మూఢమతులు. యుక్తాయుక్తవివేచన లేనివారు. ఎవరో యొకరిద్దరు తప్ప రాజులందఱు మంత్రుల మూలమున రాజ్యమేలుదురేఁ గాని లేకుండిన వారి వలనఁ గాదు. అందును మంత్రి యుత్త

ముఁడై రాజాతనిపలుకు లాలించువాఁడైన మేలుఁ బొందును. యీమూర్ఖప్రభువుమాట విని గురువును జంపినచో రాజునకును, రాజవంశమునకును గాక నాకును, నావంశమునకును గురుహత్యాదోషము సంపాదించినవాఁడ నగుదును. అధికారి తెలివిహీనుఁడై కానిపనిఁ జేయుమన్నను నేను చేయకుండుట వలనఁ బాపము లేదు. యజమానుని యాజ్ఞను మీఱిన దోషము నన్నుఁ జెందదు. కాఁబట్టి యీగురువు నెక్కడనైన దాచి రాజునకును, నాకును గీర్తి యాచంద్రార్కము నిలుచునట్లు చేసెదను. రాజునకీతనిఁ గడతేర్చినట్లే తెలియఁ జేసెదను." అని యోచించి గురువును కట్టినకట్లు విప్పి భూగృహమునకుఁ దీసికొనిపోయి భయముఁదీర్చి కాపాడి వలయు వసతు లేర్పఱిచి రాజుకడకుఁ బోయి యాతని నంతమొందించి నట్లెఱిగించెను.

తరువాత కుమారునివిషయమై మహారాజు గురువును దలఁచి తనబుద్ధిహీనతకు విచారించుచుండగా మంత్రియగు బహుశ్రుతుండు త్రికాలవేదియగు శారదానందునికడకుఁ బోయి యాసంగతి నంతయు వివరించెను. ఆమహామహుఁడు తనదివ్యజ్ఞానమున సర్వవృత్తాంత మెఱిఁగి యాతనిఁ జూచి "నీవు రాజసన్నిధి కఱిఁగి మనశారదానందగురువున కేడు సంవత్సరముల ప్రాయఁపుఁ గుమార్తె గలదనియు, నామె పరులముఖము వీక్షించి యెఱుఁగ దనియు, నామెకుఁ దండ్రి

విద్య చక్కఁగాఁ బట్టువడి యున్నదనియు, నామె మనయువ
రాజుతో మాట్లాడినఁ వెఱ్ఱి కుమరుననియు జెప్పు" మని
పంపెను.

బహుశ్రుతుఁడును మిక్కిలిగ సంతసించినవాఁడై మహా
రాజునొద్దకు త్వరితగతి నరుదెంచి సర్వము నెఱిఁగించెను.
ఆమాటల నాలకించిన నందమహీపాలునికిఁ బెన్నిధిగన్న పేద
చందమ్మున నెక్కుడు సంతోషము కలుఁగగా "మంత్రివరా,
గురుకుమారైను రావింపుము; ఆమెకుఁ దగిన యేర్పాటుఁ
గావింపుము; సకలజనులఁ బిలిపింపు" మని చెప్పెను.

'అట్లే' యని యమాత్యుండు గురుకుమారికిఁ గూర్చుం
డుటకు సరియైనస్థల మేర్పఱచి తెరఁ బన్ని దాని కెదురుగా
రాజునకును గుమారునకును బీఠము లమర్చి వానికి వెనుక
పురజనులకుఁ గూడ నిలువ వసతులఁ గూర్చెను. నియమిత
కాలమునకు సరిగా నందఱును వారివారిస్థలముల నలంకరిం
చిరి. సభయంతయు నారాటముతోఁ గూడినమనస్సు
గలదై యేమిజరుగునో చూడవలయు నని మిక్కిలి త్వర
పడుచుండెను.

అంత నొకవ్యక్తి గూఢవేషమున వచ్చి తెరలోపలఁ
గూర్చుండెను. "ఈమె చిత్రచరిత్ర మేమో చూడవలయు"
ననువారును, "ఇందఱివలనఁ గాని దీచిన్నపిల్లవలనఁ గాఁబోవు
చున్నదా?" యనువారునై యెల్లరు గుసగుస లాడుచుండిరి.

అప్పుడు వారియారాట మడఁగునట్లుగాఁ దెర కవతలనుండు
తెఱవ సదా "స, సే, మి, రా" యనుచుఁ గూర్చున్న రాజ
పుత్రుని బాగుచేయఁ దలఁచి యిట్లు పలికెను.

(1) "సకలలోకములందుఁ బరోపకారులై సద్గుణసము
దిలగు సజ్జనుల వంచించుట పాపము కాదా? నమ్మి తొడ
మీఁద నిద్రపోయెడువానిఁ బగతునిపాలికిఁ ద్రోయుట పాత
కము గాదా?" యని యడిగెను. అది వినినతోడనే రాసు
తుఁడు 'స' యను నక్షరము వదలి "సే, మి, రా" యనుచుం
డెను. ఆ "స" వర్ణ మొకటి తగ్గినందులకే జను లందఱును
విజయపాలుని రోగ మప్పుడే కుదిరినట్లు తలఁచి సంతోషించిరి.
తండ్రియుఁ గొడుకువ్యాధి నివారణ మైన దని మిక్కిలి యా
నందసాగరమున నోలలాడుచుండెను.

మఱల గురుపుత్రి (2) "సేతువు దర్శించిన యెడల
బ్రహ్మహత్యాది మహాపాతకములు పోవు నని చెప్పుదురు.
కాని మిత్రద్రోహ మేతీర్థసేవ చేసినను బో" దని నుడివెను.
ఆమాటలు జెవిని బడినంత నారాజకుమారుఁడు 'సే' యనెడి
యక్షరము విడిచి "మి, రా, మి, రా" యనుచుండెను. రాజు
మొదలగువారికిఁ గుమారునిరోగ మికఁ గుదిరినదని గట్టి నమ్మ
కము గలిఁగెను.

పిదప నాగురుకుమారిక (3) "మిత్రఘ్నుఁడు, కృత
ఘ్నుఁడు, విశ్వాసఘాతుకుఁడు వీరుమువ్వురు నాచంద్రార్కము

నరకమునందు నివసింతురు" అనిచెప్పెను. అప్పుడా రాజపుత్రుఁడు 'మి' యనునచ్చరము మాని "రా, రా" యనసాగెను. కడకు గురుపుత్రి (4) "రాజా, యీనీకుమారుని యభ్యుదయము గోరితివేని శత్రురాజులందరియొద్దను ధనముఁగొని బ్రాహ్మణులను భోజనదానంబులచేతఁ బూజింపుము." అనెను. ఈసుభాషితములచే రాకుమారునికిఁ బిచ్చి నిశ్శేషమై తన పూర్వవృత్తాంత మంతయు జ్ఞాపకమురాగాఁ దాను వేటకుఁ బోయినదిమొదలు భల్లూకశాపమునంతకు జరిగినచర్యను దండ్రికిని దక్కిన పరిజనులకును సవిస్తరముగాఁ గథారూపముగఁ దెలియఁజేసెను.

పదునెనిమిదవ ప్రకరణము.

శాపవిముక్తి.

తరువాత మహారాజునకుఁ జెప్పనలవిగాని యాశ్చర్యము గలిగి "ఓగురుపుత్రీ, ఇల్లువెడలియెఱుఁగనిదానవు రాకుమారుని యరణ్యవృత్తాంత మెట్లు కనుఁగొనఁ గలిగితివో తెలుపుము తల్లీ" యనివేఁడుకొనెను. అందుల కాతెరలోనున్న వ్యక్తి "మహారాజా, గురుకటాక్షమునను శారదాదేవి యనుగ్రహమునను భానుమతీదేవి తొడమచ్చ గనఁబడినరీతిని సకలలోకములందలి సమస్తవిషయములుమాకుగోచరము లగును".

అని చెప్పుచుండగనే రాజు సంభ్రమాశ్చర్యములు పెనగొనఁ దెరచాటున నున్నది గురుకుమారి కాదనియు శారదానందగురువనియు దృఢవిశ్వాసము గలవాఁడై తెరదూరి చెంతకేగి గురుపాదపద్మములం బడి శరణాగతుఁ డయ్యెను.

అప్పుడు గురువు తనపాదములమీఁదఁ బడియున్న మహారాజును లేవనెత్తి "రాజా,భయపడకుము. విధిఁ దప్పింప సృష్టికర్తకును వశముగాదు. మన మన నేపాటి? నీవొనరించినదంతయు నావిధివశమేగాని నీయకృత్యముగాదు. నాకేమాత్రపుఁ గోపమును నీయందు గలుఁగలే" దని చెప్పెను.

తరువాత రా జమాత్యునిదిక్కు దిరిగి యాతనిఁ గౌఁగిలించుకొని చేయిపట్టుకొని "మంత్రీ, సద్గుణతంత్రీ, ముందు గురువునుఁ గాపాడి నానరకవాసముఁ దప్పించితివి. ఇప్పుడు కుమారునిఁగాంచి యిహలోకసుఖము నందఁజేసితివి. నీవొనరించిన మహోపకారమునుఁ బొగడ వేనోళ్లుగల శేషునికైనఁ దరముకాదు. అట్టిచో నావశమగునా? భూలోకమున రాజులకు నీవంటి మంత్రులే మంత్రిశబ్దవాచ్యులు." అని కొనియాడి యమితధన కనకవస్తువాహనాదివైభవముల నొసఁగి తృప్తునిఁజేసి శారదానందునికి నూఱగ్రహారములు సర్వరాజ్యమునొసఁగి కొదువయర్ధరాజ్యమునకుఁ గొమారుఁడగు విజయపాలు నభిషిక్తునిఁజేసి తాను మునివృత్తిఁగైకొని పతివ్రతా

తిలకమునుఁ దోడునీడయు నైన భానుమతినిఁ గూడి తపోవనమున కేఁగెను.

ఆవిధమున నే "లీలావతీదేవీ, నీయపకీర్తియుఁ దొలఁగి నీవును భర్తనుగూడి సుఖముగ నుండఁగలవు. వగవకుము. ధైర్యము విడువకు" మని చెప్పెను. లీలావతీదేవియు నవ్వుమొగముగలదై "అమ్మా, చెప్పినను చాలమంచికథ చెప్పితివి. ఆహా! నావంటి పతివ్రతయంటివి. పాపము! ఆమహాలక్ష్మి యేలాగున నన్నిరోజు లోర్చినదో? సీతాదేవి పదిమాసములు భర్తకొఱ కేలాగునఁ గనిపెట్టుకొని యుండినదో? నాకీ రాత్రియే యింతకష్టముగా నున్నదే. నీవీకథ చెప్పుటవలనఁ గొంతవఱకుఁ బ్రొద్దుపోయెను. ఇంక నెంత రాత్రియున్నదో?" యన "తల్లీ, తెల్లవాఱవచ్చినది. నీదుఃఖము తొలఁగిపోవునట్లు చీఁకటియుఁ దొలఁగుచున్నది. నీపతిభక్తియొక్క ప్రకాశమువలె వెలుతురును వచ్చుచున్న" దని చెప్పుచుండగనే ప్రభాత మయ్యెను.

పందొమ్మిదవ ప్రకరణము.

'నీదేవి సునీతిదేవి.'

లోకమిత్రుఁడైన కమలబాంధవుఁడు లీలావతిమీఁదనుండు నపనిందవలె నీలోకమంతయుఁ గ్రమ్మియుండు చీఁకటి పోవుగాక యని తన కిరణముల నన్నిటిని ప్రసరింపఁ జేయు

చుండెను. పక్షులన్నియుఁ గలకలమని యఱచుచు మేతకై యిటునటుఁ దిరుగుచుండెను.

అట్టిసమయమున ధారానగరమంతయు మిక్కిలి యుల్లకల్లోలముగ నుండెను. ఎచ్చటఁజూచినను స్త్రీలునుఁ, బురుషులును "ఇదియేటివింత! అయ్యో! అనసూయారుంధతీ సీతలను మించునట్లుండు నీపతివ్రతామతల్లి కెందుండి కలిగినదీ ముప్పు? అకటా! రాజెంతపని కొప్పుకొనెను. కలికాలమేమి? అగ్నిప్రవేశమేమి? ఎంతపతివ్రతయయిన నీకాలమున నగ్నిఁ బ్రవేశింపనగునా? కానిండు, రండు, కన్నులతోఁ జూడనైనఁ జూత" మని వరుసలు వరుసలుగా వచ్చుచుండిరి.

రాచనగరిలో నొకయుచితస్థలమునఁ మంచిగంధపుఁగట్టెలతో నగ్నిరగుల్పఁబడి యుండెను. బ్రాహ్మణులందఱుఁ జుట్టుమూగి మంత్రముల జపించుచు నాజ్యాహుతి వ్రేల్చుచుండిరి. అయ్యది యాకాశము నంటునట్లు మిక్కిలి భయంకరముగ మండుచుండెను.

అప్పుడు లీలావతి స్నానముచేసి తెల్లని పట్టుచీరధరించి తుమ్మెదఱెక్కలవలెనుండు కురులు వ్రేలవైచుకొని వచ్చి ప్రాణేశున కభిముఖముగ నిలుచుండి మనస్సున ధ్యానించి వందనమొనర్చి పండితులొనర్చిన ద్రోహమును మది నిడుకొని పురజనులవైపుఁ దిరిగి వారలతోఁ జెప్పుచున్నట్లు "ఓనాప్రజలారా, మీరందఱు నాకు సహోదరీ సహోదరసమానులు.

మీరే తప్పుఁ జేసియుండినను నేను క్షమించుచున్నదానను. నామీఁదనున్న యీనేమోవలేని యపనిందఁ బాపుకొనుటకు నే నీపనికిఁ గడంగితిని గాని మీనేరము బయటఁబెట్టుటకుఁగాదు." అనిపలికి యగ్నివైపుఁదిరిగి చేతులు ముకుళించి నమస్కారముఁ జేయుచు "ఓయగ్నిభట్టారకా, నేను నాభర్తనే దైవమని నమ్మి సర్వకాలసర్వావస్థలయందును బరపురుషు మనస్సునందైనను మోహించియుండనేని నీవుశీతలుఁడవగుదువుఁగాక" అని మూఁడుమాఱులు ప్రదక్షిణముఁజేసి యందఱు "హా, హా" యని రోదనముసేయుచుండగా నగ్ని ప్రవేశమయ్యెను.

ఆసమయమున, "అహో, పతివ్రతల మనంబులెప్పుడు నీలాగుననే పరమసాత్త్వికంబులుగదా. రాణి యగ్నిఁ బ్రవేశింపనున్నది. ఆమె నావహ్ని యేమియుఁ జేయదని తలఁచినను నామన సోర్వకున్నది. ఆమె కేదేని కీడుగలిగెనేని నేనును నా చిచ్చునందే యుఱికి నాదేవియందును గాళిదాసునందును గావించిన పాపమునుఁ బోఁగొట్టుకొనెద" నని యాలోచించుచు నిలుచుండిన భోజమహారాజు మొదలునఱికిన చెట్టువలె నేలమీఁదఁ గూలెను. మంత్రిమొదలగు వారాతనికి శైత్యోపచారములు చేయుచుండిరి.

ఆక్షణమే యింద్రాణిఁబోలిన లీలావతీదేవి ధౌతవస్త్రము మాయకుండఁ జెన్నఱికురులయందుఁ దుఱిమిన కుసుమం

బులు వాఁడకుండ వికసించిన పద్మమువలెనుండు నవ్వుమొగముతో నగ్గిగుండము వెడలివచ్చి నిలిచియుండెను. అప్పు డాకాశవాణి "ఓ భోజమహారాజా, ఆశ్రితకల్పభూజా, నీదేవి సునీతిదేవి. పతివ్రతాతిలకము. ఆమెయం దేపాటియుఁ గల్మషములే" దని పలికెను. వెంటనే దివినుండి దేవతలు పుష్పవర్షము గురిపించిరి.

భోజమహారాజు సేదదేఱి తెలివినొంది యా గగనవాక్యములన్నియు విని పశ్చాత్తాపముతో లీలావతీదేవిని గాఢాలింగన మొనరించి చిబుకముఁ బుడుకుచు "దేవీ, సుగుణంపుదీవీ, నేను నీయెడఁ గావించిన తప్పునకై నన్ను మన్నింతువుగాక. నేను మహాపాపిని. నీదయకుఁ బాత్రుఁడఁగాను. నిజము. ముమ్మాటికి నమ్ము" మని వేఁడుకొనెను.

అప్పుడు లీలావతీదేవి "హృదయేశ్వరా, నన్ను క్షమించి రక్షింపఁ బ్రార్థించుచున్నదానను. మీరేమియు నాయెడ నెగ్గుసేసి యుండలేదు. ఇది నాకాలకర్మదోషము. ఇందులో నెవరితప్పిదమును లేదు. మీకింత నిర్దయఁ జూపనియెడల నేనెంతటిదాననైనది యెవ్వరికిఁ దెలియును? రత్నము సానఁ బట్టినఁగాని దాని కాంతి సంపూర్ణముగఁ బయల్పడు. అలాగుననే నాశీల మిప్పుడు రోదోంతరాళమున వెలయుచున్నది" అని యంతఃపురగామిని యయ్యెను.

ఇరువదియవ ప్రకరణము.

విలాసవతి.

రాజుచే వెడలింపఁబడిన కాళిదాసుఁ డేమి చేయుటకుఁ దోఁచక దిగ్భ్రమతో ముందు తిన్నగా వేశ్యయుఁ దన ప్రియురాలు నగు విలాసవతి చెంతకుఁబోయి "ప్రేయసీ, నేటికి నాకును నీకును ఋణము దీఱినది. రాజునకు నామీఁద మితిలేని యాగ్రహము గలిగి తనరాజ్యములోనే యుండఁగూడదని యానతిచ్చెను. కనుక నేను పరరాజ్యమునకుఁ బోయెదను. దయయుంచుము. సెలవిమ్ము" అనెను.

ఆమాటలు వినినతోడనే విలాసవతియుఁ గాంతుని చేయి పట్టుకొని "రాజుల యాదరణములు క్షణభంగురములనియు శాశ్వతములు గావనియు నొక్కనిమిషమున నర్ధాసన మొసఁగి గారవించి మఱియొక్క నిమిషమునఁ దమ చంద్రాయుధమున కెరసేతు రనియు నెల్ల రెఱిఁగిన విషయమే గదా! ప్రాణనాథా, నాసంతోషనిలయమగు జీవితేశ్వరా, నన్ను వదలి యేదేశమునకుఁ బోదువు? నీవంత నిష్కరుణుఁడవై నన్ను వీడిపోవ సమకట్టినను నేనుమాత్రము నిన్నుఁ బాయఁజాలను. రాజిచ్చు ధనముతో నీకవసరము లేదు. నీ వెవరికంటఁ బడకుండ నాయంతస్వాధీనమునందే నాకున్నధనముతో సంతోషముగఁ గాలము గడుపవచ్చును. మనమిరువురముఁ

గలసి యేచెట్టుక్రింద నున్నను నదియే నాకు దేవలోక మగును. మనస్సులుగలియని భార్యాభర్తలాయమరావతీపట్టణమందున్నను నది వారికి నరకకూప మగును. నేనొక వేశ్యననియు నీవు కాలవశమున నన్నుఁ జేపట్టితి వనియు యోచించి నన్నెడబాసి పోవఁ దలఁచితివేమో? అట్లెన్నడును దలఁపకుము. నన్ను నీవు వివాహమాడకున్ననుఁ బూర్వకృతమగు ఋణానుబంధమునఁ బరస్పరహృదయము లైక్యములైనవి. కనుక నింకఁ బ్రాణము లున్నంతకాలము నిద్దఱ మొకరినొకరు విడనాడఁగూడదు. నీకు వచ్చిన కష్టమునుఁ దీర్చుకొను నుపాయముఁ జింతించుట మాని యూరు వెడలిపోవుట న్యాయమా? నిష్కారణమైన యపనింద మోయుట భారముకాదా? ప్రాణనాథా, నాయందు విశ్వాసముంచి సంగతి నెఱిఁగింపుము. మూఁడు నాలుగు దినములనుండి మీముఖ మేదో విచారమును సూచించుచునే యున్నది. ఏమి జరిగినదో చెప్పవలయును." అని నొక్కి యడుగఁగా, కాళిదాసు మిక్కిలి ప్రేమతో విలాసవతి చేయిపట్టుకొని దగ్గఱఁదీసి తొడమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని చెక్కిలి ముద్దిడి తనవృత్తాంత మిట్లు చెప్పెను.

ప్రాణప్రియా, భోజరాజు నాస్థానమం దైదునూర్లకధికసంఖ్యాకులగు పండితులు గలరు. ఆమహారాజున కేమితోఁచెనోగాని కవులకందఱకు రాజుగ నన్ను నియమించెను. అందఱకు లక్ష యిచ్చిన నాకు రెండులక్షలధన మిచ్చుచు నెక్కు

డుగ నన్నాదరించుటవలన నెల్లరకు నాయం దసూయ పుట్టెను. వారు నను బొడఁగాంచిన నాగుఁబామును జూచినట్లు నడుచుకొనుచుండిరి. ఇట్లుండ నొకనాఁడు రాజుగారి తండ్రి తద్దినము వచ్చెను. నాతోఁగూడ నెందఱోపండితు లచ్చటి కేతెంచిరి. అందఱిని భోజమహారాజు తృప్తులఁజేసి పంపెను. మఱలివచ్చుచుండగా, మంగలివాఁడొక డెదురై నన్ను, 'అన్నా' యని సంబోధించెను. తరువాతిచర్య లోకవిదితమే గనుక నీకును దెలిసియే యుండును. పిదప బ్రాహ్మణులచేఁ బ్రాయశ్చిత్తము జేయించికొనినను రాజొకనాఁడు, పండితులతో నాకులముఁ గూర్చి ముచ్చటించుచు 'నేను నమ్మలేను. మంగలివాని కెక్కడి దీయసమానపాండిత్యము?' అని చెప్పెనట. అందులకుఁ బండితు లందఱు నేను మంగలినని చెప్పుటకు దృష్టాంతముగ నే నంగడినుండి మాంసముఁ గొనిపోవు నప్పుడు తాము చూచి యుంటిమని చెప్పిరఁట. మహారాజును, 'కాళిదాసు మాంసముఁ జేతఁబట్టుకొని యున్నపుడు నావద్దకుఁ బట్టి తెండు. లేకున్న మిమ్ము నూరువెడల శిక్షచేయుదు' నని శాసించెనఁట. అమీఁదఁ బండితు లందఱు 'నీపని నెఱవేఱు టెట్లు? అయ్యో వారినిఁ జేయఁబోయినఁ గోఁతిపిల్ల యాయె నన్నట్లు కాళిదాసుని మీఁద నింద దృఢపఱుపఁ దలఁప మనకే కష్టము వచ్చెనే యని మిక్కిలి విచారముతో నేమిచేయుటకుఁ దోఁచక తిరుగుచుండిరి. ఈసంగతి నెఱిఁగిన నేను వారి కవమానము చేయఁ

దలఁచి వారు బజారునం దుండఁగనే చేపలఁ గొని చేతఁ బట్టుకొని పోవుచుంటిని. అది చూచి సంతోషించినవారై నన్ను రాజునొద్దకుఁ గొంపోయిరి. తరువాత దానిని నేను కాళికాదేవి ప్రభావమున రామాయణ గ్రంథముగా మార్పఁ గలిగితిని. అప్పుడు వారికిఁ గలిగిన యవమానముఁ జెప్ప నలవిగాదు. తరువాత నేమిచేసిరో గాని యీనాఁ డూరు వెడలుమని యుత్తరు వైనది.

అని సవిస్తారముగాఁ జెప్పి యూరకుండెను.

ఇరువదియొకటవ ప్రకరణము.

దివ్యమంజీరము.

ఒకనాఁ డంగటి కొకపరిచారిక యమూల్యాభరణ మొం డమ్మఁ దెచ్చెను. అందులోని యొకమాణిక్యపు విలువకైన నాధారానగరమంతయు నీడు కాన ట్లుండెను. రాజభటు లాభూషణము మహారాజుల దనియు, దొంగతనమున బజారునకు వచ్చిన దనియుఁ దలఁచి దానిని దెచ్చినయాపెతోఁ గూడఁ గొనిపోయి రాజుముందఱఁ బెట్టిరి.

అప్పుడు రాజు దాసిని జూచి "ఎవర్తవు నీవు?" అని యడిగెను.

దాసి—నేను విలాసవతియను వెలయాలి దాసిని.

భో—ఈవింతనగ నీ కెక్కడిది?

దాసి—మాయజమానురా లమ్ముటకై నాచేతి కిచ్చినది.

భో—ఆమె కెట్లు లభించెను.

దా—తనప్రియుఁడగుఁ గాళిదా సామె కొసఁగెను.

భో—దీనిసంగతి కొద్దిగనో గొప్పగనో నీకుఁ దెలిసి యుండును. ఎఱిఁగియున్నంతవఱకుఁ జెప్పుము.

దా—దీనిసంగతి యనగా నా కేమియు నర్థము కాలేదు.

భో—ఇది మీయజమానున కెట్లు దొరికె నని యడుగుచున్నాడను.

దా—"మహారాజా, చెప్పెద నవధరింపుఁడు. ఒకనాడు కాళిదాసు దీనిఁ జేత నుంచుకొని యుండెను. అప్పుడు విలాసవతి 'మనోహరా, ఈదివ్యభూషణ మెవ్వరి' దని యడిగెను. దాని కాకాళిదాసు 'ప్రియురాలా, ఇది మాపిత్రార్జితము. ఈయూర నిప్పుడు క్రొత్తఁగా 'నేను గాళిదాసుని తమ్ముఁడ' నని తిరుగుచున్నవాఁడు నాయనుజుఁడే. మాపిత్రార్జితమైన ధనము చాల యుండెను. అది భాగించుకొనుచు నీజతకై మే మిరువురము నాకే కావలయు నాకే కావలయు నని వివాదపడి తుదకుఁ జెఱియొకటి తీసికొంటిమి. పైతృకమైన యీమణిమంజీరముం బోఁగొట్టుకొనఁగూడ దని యిన్నాళ్లు దాచి యుంచితిని. ఇప్పుడు మహారాజునకు నామీఁద నాగ్రహము గలుగు

టచే నన్నీయూరు వెడలిపొమ్మని చెప్పెను. ఇది తప్పనాయొద్ద నింకేదియు లేనందున నిన్నుఁ దృప్తిపఱిచి పోఁదలచి నీకీఁ దెచ్చితిని. దీని నమ్మి వచ్చినధనము నీయిచ్చవచ్చినటుల వెచ్చించుకొనుము. ఇది నీవు ధరించుటకు దీనిజత లేదు. మాతమ్ముఁ డింకను దాని నమ్మినట్లు తోచదు. అమ్మియుండిన నాకుఁ దెలియకపోదు. దాని నీధారాధీశుఁడు తప్ప యింకెవ్వరునుఁ దగినధన మిచ్చి కొనలేరు?" అని మాయజమానుఁడు చెప్పఁగా వింటిని.

అందుల కాభోజమహారాజు సంతోషించి యాదాసి కమితద్రవ్య మొసఁగి పంపి తాను భటుల రావించి "యీయూరఁ గాళిదాసుని తమ్ముఁడగు మంగలి గలఁడు. వానిని నాయొద్దకుఁ బిలుచుకొనిరం" డని యాజ్ఞాపించెను. అలాగే రాజభటు లానాపితునిఁ దోడ్కొనివచ్చిరి. అప్పుడీవిధమున వారికి సంభాషణ జరిగెను.

భో—నీవేగదా కాళిదాసుని యనుజన్ముఁడవు.

మం—అవును స్వామీ, నేనే.

భో—నీవును కాళిదాసుఁడును మీపిత్రియమైనధనము విభజించుకొంటిరా?

మం—చిత్తము మహాప్రభూ, పంచుకొంటిమి.

భో—అయిన నందులో దివ్యమంజీర మున్నదా?

మం—మహారాజా, ఎన్నియోనగలు, నెంతయో

ధనముఁ బంచుకొంటిమి. అది యేదో చూచినఁగాని మనవి చేయఁజాలను.

భోజరా జప్పుడు తనయొద్దనేయున్న పెట్టెయఁ దెఱచి యాయలంకార మెత్తి చూపెను. వాఁ డది గనిన తోడనే కంపించుచు ‟మహారాజా, ఇట్టిది నాయొద్ద లేదు. అతఁ డెక్కడ సంపాదించెనో యెఱుఁగను”. అని చెప్పెను.

భో—ఓరీ, మీరిద్దఱు నిజముగ దాయాదులరు; అన్నదమ్ములరు; ధనము పంచుకొనినవారు. ఇటువంటి సొమ్ము మీలో నొకనియొద్ద నుండుటయు నింకొకనిదగ్గఱ లేకుండుటయునా? నమ్మఁదగదు. ఇది కాళిదాసు చెప్పిన మాట గాదు. అతనిప్రియురాలగు విలాసవతి, యొంటికాలి యందె తన కుపయోగపడ దని యమ్ముటకై బజారునకు దాసిచే నంప నది మాకుఁ జిక్కినది. కాళిదా సానాని కిచ్చి యుండవచ్చును. కాఁబట్టి తప్పక దీనిజతయగు నూపురము నీ యొద్ద నున్నది. దానికి సరియైనవిలువ యివ్వమని కాఁబోలు నీవీలాగునఁ జెప్పుచున్నావు. అటు లనుకొనవలదు. ఇప్పు డా వేశ్య కిచ్చినదానికంటె రెండంత లెక్కువగా నిచ్చెదను.

మం—దేవా, నే నది యెప్పుడుఁ గంటితోఁ జూచి నది లేదు. ఆయాభరణము మేము భాగవిమర్శన చేసికొన్నప్పుడును లేదు.

అప్పుడు భోజమహారాజు ‟వీఁడు ద్రవ్యలోభముచే

నీరీతినిఁ జెప్పుచున్నవాఁడు. వీని నేవిధమున దండించి లోఁగుట్టు బయటపెట్టవచ్చునో యాక్రమము నాచరింపుఁడు”. అని బంటుల కాజ్ఞ యొసఁగెను. అంత నాకింకరులు వానిని జక్కఁగా మర్దించిరి. వాఁడాబాధ సహించలేక, ‟అయ్యా, నేను గాళిదాసు తమ్ముఁడను గానయ్యా. కొందఱు డబ్బిచ్చి నన్నట్లుఁ జెప్పుమన్నారయ్యా, మీపాదములకు దండమయ్యా, నన్నువిడువుఁడయ్యా” యని యనేకవిధముల మొఱలిడగా ‟ఎవ్వరు లంచమిచ్చి నిన్నట్లు పరమాయించి” రని రా జడిగెను.

అందున కాతఁడు ‟దేవా, మీసభయందలి పండితులు నాకుఁ బైక మిచ్చి కాళిదాసుని తమ్ముఁడ నని చెప్పికొను మనిరి. అదియుఁ గాక పితృవిత్తము పంచుకొన్నట్లును, దానివలన నాతఁడు భాగ్యవంతుఁడై యున్నట్లును చెప్పుమనిరి. నే నికమీఁద నిట్టిపనికి రాను మహాప్రభో, అభయహస్త మిమ్ము. నీచుఁడఁ గనుక నీపని కొప్పుకొంటిని” అని యనేకవిధములఁ బరిదేవనంబు సేసెను. అప్పుడు భోజమహారాజు మిగుల నాశ్చర్యపడి యాముండిని విడిచిపుచ్చి, ‟ఆహా! ఏమి యీవిపరీతము? నే ననుకొన్నది నిజమైనది. సరస్వతీపురుషావతారుఁడైన కవి యేడ? దివాకీర్తికులజుఁడగుట యేడ?” అని లోలోఁ గవులకుట్రలఁ గూర్చి యాలోచించుచుండెను.

ఇరువదిరెండవ ప్రకరణము.

అహా! ఇదియంతయుఁ బండితుల పన్నాగమా?.

ఆక్షణమందే తరంగవతి వచ్చి మహారాజు పాదముల మీఁదఁ బడి

"శరణు శరణు శరణు మహారాజా
శరణు శరణు శరణు దీనజనపోషా
శరణు శరణు శరణు కరుణాకరా

నేను పరమపాపాత్మురాలను, స్వామిద్రోహినిని, నన్ను క్షమించవలయును" అని ప్రార్థించెను.

భోజభూజాని మిగుల నచ్చెరువొందుచు "ఈతరంగవతి నా పాదములమీఁదఁ బడి శరణు వేఁడుటకుఁ గారణ మేమై యుండునో" అని యనుకొని "తరంగవతీ, లెమ్ము. ఎందుకై యిట్లు శరణు వేఁడుచుంటివి? అట్టి నేరమేదియు నీవు నాయెడలఁ జేసియుండలేదే?" అని యడిగెను.

తరంగవతి "ఓ దేవా, పండితులందఱుఁ జేరి నన్నొక పని చేసిపెట్టుమని వేఁడిరి. అది యేదని యడుగఁగా ముందు శపథము చేసినఁగాని యెఱిఁగింప మనిరి. ఏమి చెప్పబోయెద రని నిర్లక్ష్యముగ నేను ప్రమాణము చేసితిని. తరువాత వారందఱుఁ దమకుఁ గాళిదాసు మహావిరోధియనియు వాని నూరు వెడలింప వలయుననియు, నట్లు చేయుట కుపాయాంతరము లేమ

గనుక నాచేఁ దంతఃపురద్రోహియని మహారాజునకు నమ్మకము గలుఁగునట్లుఁ జేయవలయు ననియు, లేకున్నఁ దా రెల్లరు ప్రాణత్యాగము చేతు రనియు నన్ను నిర్బంధించిరి. అది కారణముగ నట్లు చేయకున్న బ్రాహ్మణులందఱు లాత్మహత్య గావించుకొనెదరనియు, నందువలన బ్రహ్మఘ్నపాతకము నాకుఁ గలుగుననియు భయపడి, దేవి పాతివ్రత్యప్రభావ మెఱిఁగినదాననుగనుక, నామె యేవిధముచేతనైనఁ దన శీలమును రక్షించుకోఁగల దని నిశ్చయించుకొని, మీ రొంటరిగఁ బరుండి మేల్కొనియున్న సమయముఁ జూచి యాలాగుఁ జేసితిని. దేవా, పూర్వము క్షమించఁదగని పాపముఁ గాకాసురుఁడు చేయఁగా శ్రీరాముఁడు శరణమిచ్చి రక్షించలేదా? అటులనే నన్నిప్పుడు మన్నింతురుగాక". అని వేఁడుకొనెను.

అంత భోజభూపతి యెంతయు విస్మయము చెంది, 'అహా! ఇదియంతయుఁ బండితుల పన్నాగమా?' అని లీలావతినిఁ జూచి, 'ఓసతీతిలకమా, నీమనోనైర్మల్య మెఱిఁగినవాఁడనయ్యుఁ జివరకు వీరి కపటకూపమునఁ బడి నీయెడ నెంత యపరాధముఁ జేసితిని? అక్కటా! నాజన్మ మొకజన్మమా? నేనెంత బుద్ధిహీనుఁడను? నాపాప మెట్లుపోవును?, అని యనేకవిధములఁ దన్నుఁ దా నిందించుకొని క్షమించుమని బ్రతిమాలుకొనెను.

మహారాజునకు రాణి యెడ నొనరించిన యనుచితము కంటెఁ గాళిదాసునిపట్లఁ జేసిన దోషమే హృదయశల్యమై బాధించుచుండెను. ఆయన కేమాత్రము శాంతి గలుగలేదు. ఏపాపము నెఱుఁగని పరమపావనుని, సరస్వత్యవతారపురుషుని, నాత్మహితునిఁ, గాళిదాసునిఁ బోఁగొట్టుకొంటినిగదా యనియు, నింతకు నామహాత్ముఁడు మనస్సున నెంత చింతించెనో, యెచ్చటికిఁ బోయెనో యనియు, నింక నాసత్పురుషుని సందర్శనభాగ్య మెట్లబ్బు ననియు, నతని దర్శించినను దనతో మఱల స్నేహింపనాతఁడు సమకట్టునా యనియు, నామహాత్ము దర్శింపక యెట్లు బ్రదుకుదు ననియు నిట్టూర్పు నిగిడించుచుఁ, బలుమాఱు తలపోయుచు, విచారసాగరమగ్నుఁడై యుండెను. ఇట్లు కొన్నదినములు సనినచో రాజు బ్రతుకుననునాస యెవ్వరికిని లేకపోయెను. చారులు దేశదేశముల కరిగిరి గాని కాళిదాసు వృత్తాంత మరయలేక పోయిరి. పోయినవారందఱు నిష్ప్రయోజనులై తిరిగివచ్చిరి. ఎచ్చట విన్నఁ 'కాళిదా సెట్లుదొఱకును?' రా జెట్లు జీవించును. అని చెప్పుకొనువారే.

క వి రా జు నే ర్ప ఱ చు ట .

ఇట్లుండ నొకనాఁడు పండువెన్నెల కాయుచుండెను. విచారగ్రస్తుఁడైన భోజమహారాజునెదుట లీలావతీదేవి నిలిచియుండెను. అప్పుడు రాజునకు లీలావతీదేవి ముఖము నిండుచంద్రబింబమా? లేక యాకాశముననున్నదా? యని సందేహము కలిగెను. 'ఈసమయమునఁ గాళిదా సుండిన నెంతయు సంతోషదాయక మగునుగదా. నాసందేహముఁ దీర్చునుగదా' యను విచారము కలిగెను. ఆరాత్రి యంతయుఁ గించతో నెట్లో గడిపి ప్రాతఃకాలమున లేచి కాల్యకృత్యములఁ దీర్చుకొని సభకు వచ్చెను. కవు లందఱును రాజు కొలువున కేతెంచెనని తెలియఁగానే మితిలేని యానందముతో నొకరొకరుగా వచ్చి సభ నలంకరించిరి.

అప్పుడు భోజమహారాజు, సభయంతయుఁ గలయఁజూచి, "ఓపండితులారా, నేను గాళిదాసునియం దనురాగము గలిగి యున్నానని యోర్వలేనివారై కవి నూరు వెడలించితిరి. నాఁటినుండియుఁ గవితామహిమ మడుగంటెను. కవులకు రాజులేక నాకేమియు బాగుండలేదు. ఎవ్వరికెంత మాత్రము శక్తియున్నదియుఁ దెలిసికొంటినేని నామనస్సునకు నచ్చువారిని రాజుగ నేర్పఱుప సమకట్టితిని. కనుక

మీరిప్పుడు ముందు నేనిచ్చు సమస్యను బూర్తి సేయుఁడు. అదేమన,

గీ. ఈవరారోహ ముఖచంద్రు నీశశాంకుఁ
డనుసరించెడిఁ దులనకు నాసచేసి.

శ్లో॥ తుళణ, అణు, అణుసరఇగ్లా, స
ముహ చందస్స ఖువిదాయే॥

ఎవ్వరీసమస్యకు సరిగ నుత్తరార్ధముఁ జెప్పెదురో వారాస్థానకవిరాజపద మధిష్ఠింపఁ దగుదురు. అట్లెవ్వరును బూర్తి చేయరేని మీరు నాదేశము విడిచి పోవలయును." అని చెప్పి యంతఃపురమునకుఁ బోయెను. పండితు లందఱు నెంత ప్రయత్నించినను నెవ్వరికిని సమస్యపూర్తి దోఁచినది గాదు. అప్పుడు వారొక యాలోచనచేసి బాణుని మహారాజుకడకుఁ బంపిరి. అతఁడు ప్రభుసన్నిధి కేగి "దేవా, పండితులందఱు నన్నుఁ బంపిరి. ఒక వారము గడు విచ్చినఁ బూర్తి చేసెదమని చెప్పుచున్నారు. ఎనిమిదవనాఁ డట్లు చేయలేకున్నచో నూరువిడిచి పోవుటకు సిద్ధముగా నున్నాము" అని విన్నవించెను.

అనవుడు మహారాజు నవ్వి "యీసమస్య పూర్తి చేయుటకు వారము వ్యవధి కావలయునా? సరే, యిచ్చితిని. ఆ ట్లీవారము రోజులలోఁ జేయనిచో రిక్తహస్తములతోఁ బాఱఁదోలఁ బడుదురు." అని ప్రత్యుత్తర మిచ్చెను.

ఆసంగతి విని 'సరి' యని పండితు లంద ఱిండ్లకుఁ బోయి యేడు దినములు నెంతయుఁ బ్రయాసపడిరి కాని వారల కేమియు స్ఫురించలేదు. చివరకందఱు కవులు నాఁటిరాత్రి యొక్కచోటఁ జేరి బహువిధముల యోచించిరి. ఇంటి పైకప్పు వైపు చూచిరి. ఆదేమియు వారికి సమస్యను బూర్తిచేయు విధము చెప్పలేదు. తరువాత తలగీరుకొని ముక్కునలుపుకొని మూతిముడుచుకొని యెన్నియోవిధముల నాలోచన చేసిరి. ఫలితము లేకపోయెను. ఇంకఁ జేయునది లేక యొకరితో నొకరు వాదులాడ మొదలిడిరి. బాణుఁడు, "కాళిదాసును వెడలించిన ఫలము తెలిసినదా? ఆహా! యోర్వలేనితన మెంతకుఁ దెచ్చెను?" అని నుడువగా మయూరుఁడు, "అయ్యో! నీవుమాత్రము బహూత్తముఁడవా? మాపన్నాగమునకు నీవును దోడుపడలేదా?" అనెను. తరువాత నందఱు పరస్పరముఁ గలహించుచుండ భవభూతి వారి జగడముల వారించి 'సమస్య పూర్తిచేసెద వినుఁ' డనెను. అందుకు వారలు మిక్కిలి సంతోషముతో వినుటకై మోరలెత్తి చూచుచుండిరి.

అప్పు డాతఁడు, "ఓకవిసంఘమా, నే నొనర్చు సమస్య పూర్తి చక్కఁగా వినుఁడు. మనమీవిధమునఁ బూర్తి చేయలేనివారమై తెల్లవాఱువఱకు నుందుమేని కట్టుబట్టలతో రాజభటులచే వెడలింపఁబడుదుము. కనుక నామాట వేద

వాక్య మనుకొని, చంద్రికాంతి యుండగనే బండ్లు సిద్ధముచేసి వస్తువాహనములతోఁ బయనము గండు. రాజభృత్యులకుఁ బట్టువడక పోవుటయే మన మాసమస్యను బూర్తిసేయుట.” అని చెప్పెను.

అప్పు డందఱును నవ్వి వాని బుద్ధిచాతుర్యమునకు మెచ్చుకొని వారి వారి గృహముల కేగి శకటము లమర్చుకొని సామగ్రులతోఁ బ్రయాణమైరి.

ఇరువదినాలుగవ ప్రకరణము.

చారణుఁడు.

నిండువెన్నెల గాయుచుండెను. జ్ఞానుల హృదయము వలె నిర్మలముగ నుండు నాకసమున వారికిఁ బుట్టుయోచనల వలె నక్కడక్కడ నక్షత్రములు వెలుఁగుచుండెను. అట్టి సమయమున ధారానగరోపాంతముననున్న యుద్యానవనములో నుండి బండ్లవరుస యొకటి పోవుచుండెను. అప్పుడొక సువేషాలంకృతుఁడు చేతియందు ఖడ్గము ధరించినవాఁ డెదురాయెను. ఆపోవు బండ్ల నన్నిటిఁ జూచి యందున్నవారు భోజరాజు నాస్థానకవులని గ్రహించి జయశబ్దంబు పల్కి “ఓ పాంథులారా, మిమ్ముఁ జూడ భోజసభాలంకారులవలెఁ గన్పట్టుచున్నారు. ఇంత రాత్రియం దెచ్చటికిఁ బోవుచు

న్నారు? మహారాజునకుఁ గుశలమేకదా? నేను కాశీనగరవాసిని. చారణుఁడనువాఁడను” అని పలికెను.

అప్పుడు వారందఱు నూరకుండిరి గాని యొక్క మయూరుఁడుమాత్రము “అయ్యా, నీ వెక్కడకు పోవుచున్నావు?” అని యడిగెను. దానికిఁ జారణుఁడు “నేను ధనాశచే భోజమహారాజు నాశ్రయింపఁ బోయెదను, అల్పకవిని” అని చెప్పెను. అంత మయూరుఁడు “ఓయీ, నీవు భోజరాజు నొద్దకుఁ బోయినప్పుడు వినబోవునది నే నిప్పుడే చెప్పుచున్నాను. వినుము” అని వానికి రాజిచ్చిన సమస్య చెప్పి యది పూర్తిచేయలేక యీలాగునఁ బోవుచున్నామనియుఁ వాక్రుచ్చెను.

వారి మాటలకుఁ జారణుఁడు నవ్వి “ఇదియేనా సమస్య? అర్థము చాల గూఢముగ నున్నది. ఇది మహారాజు పూర్ణేందుమండలముఁ జూచి వచించినది. దాని కుత్తరార్థము

శ్లో. అణు ఇది బంణ యది కహం
అణు కిది తస్సపడి పది చందస్స॥

గీ. అనుసరించెడి నననేల యజ్ఞవైరి
కనుకృతి యదెట్లు ప్రతిపత్తునందుఁ దలప.

అని నుడివి వడివడిగా వెడలి పోయెను.

అప్పుడు పండితు లందఱు మహాశ్చర్య మగ్నులై “ఆహా, సరస్వతియే మనయవస్థఁ జూడలేక పురుషరూప

మున సాక్షాత్కరించినది. లేకున్న నింత త్వరలో నింతచక్కఁగాఁ బూర్తిచేయుటకు మనుష్యులకుఁ దరమా?" యని వేనోళ్ల నాచారణుని స్తుతించుచుఁ దాము ప్రయాణమైనసంగతి యెవ్వరైనఁ జూచెదరేమో యని యతి త్వరితగతి నిండ్లవైపు బండ్లఁ ద్రిప్పి సామానుల దింపి ప్రాతఃకాలమున చారణుఁడు రాజునుఁ జూడక మునుపే తాము పోవలయునని యొకరితో నొకరు మాట్లాడుకొనిరి.

అంతఁ దెల్లవాఱ సూర్యోదయము కాకమునుపే యెవ్వరికి నెఱుకపఱుపక బాణుఁడు ముందులేచి కాల్యకృత్యములఁ దీర్చుకొని రాజునొద్దకుఁ బోయి సమస్యనుఁ బూర్తి చేసెను. రాజును గడు ముదమున బాణునికిఁ బదునైదులక్షలు బహుమతి చేసెను.

అది యెఱిఁగి తక్కిన కవులు బాణునకు శాస్తి చేయఁ దలఁచి జరిగిన వృత్తాంతమంతయుఁ రాజునకుఁ దేటపఱచిరి. అప్పుడు భోజమహారాజు "నే ననుకొన్నట్లుగానే యైనది. నా మనోగతము కాళిదాసునకుఁ దప్ప యింకెవ్వరికిని దెలియదు. తప్పక కాళిదాసు చారణవేషమున నీయూరనే యున్నవాఁడు. అదియు నింకఁ గొంత సేపటికి విశదమగును. నిజముగఁ జారణుఁడైన నింకఁ గొంతతడవునకు నాదర్శనమునకు రాక తప్పఁడు" అని మనస్సునఁ జింతించి తక్కిన కవులకు నమిత ధన మొసఁగి పంపెను.

ఇరువది యైదవ ప్రకరణము.

కాళిదాసుని గాంచుట.

కవులు చెప్పిన ప్రకారము చారణుఁడు వచ్చునని రాజు కొంత తడవు నిరీక్షించెను గాని రాఁడాయెను. వానినిమిత్త ముద్యానవనమునకుఁ బోవలయునని గుఱ్ఱముల నాయత్తముచేసి తెప్పింపఁ బరిజనుల కాజ్ఞయొసఁగెను. ఆ యంశము విన్న వారందఱుఁ గారణము తెలియక మహాభయమునఁ గళవళపడఁ జొచ్చిరి. "ఏమిది? మహారాజు దేవపూజాదీక్షయం దున్నవాఁడని వింటిమి. ఇంతలోనే యుద్యానవనమునకుఁ బోవ నవసర మేమికలిగినది?" అని యనుకొనుచు మిక్కిలి తడబాటుతో సేవకులు బయలుదేఱిరి.

భూపతి యప్పుడు కవివరులతోఁ గలసి నక్షత్రములతోఁ గూడిన చంద్రునికైవడి మహావైభవవిభ్రాజమానుఁడై యుద్యానవనము దాటి రాత్రి పండితులఁ జారణుఁడు కలుసుకొన్న చోటికిఁ బోయెను. అచ్చట నాచారణుని యడుగుజాడలఁ గని వానిఁ దాను గుర్తించినటుల నటించి పదచిహ్నజ్ఞనిపుణుల రావించి "ఈమార్గమున రాత్రి యెవ్వఁడో పురుషుఁడు పోయినవాఁడు. వాని పాదచిహ్నము లింకను గనఁబడుచున్నవి. కాఁబట్టి వాఁడెక్కడ నుండునదియుఁ గనిపెట్టి నాకుఁ జెప్పవలయు" నని యాజ్ఞాపించి నగరునకు వచ్చెను.

సేవకులు వెదకిరిఁగాని యాపాదముల గుర్తులఁ గనిపెట్ట లేకపోయిరి. అట్టితమ యసామర్థ్యము రాజుతోఁ జెప్పిన నేమి యాజ్ఞ చేయునో యను భయమున నటు నిటు నాదినమంతయుఁ దిరుగుచుండిరి. వీరి పాటునుజూచి దైవము దయ తలఁచి వచ్చెనో యన సాయంకాల మొకదాసి యొకచినిఁగిన పాదరక్ష చేతఁ బట్టుకొని మాదిగవాని యింటికిఁ బోవుచుండెను. సేవకు లది వీక్షించి దానికిఁ గనఁబడకుండునటుల వెంటనంటి పోయి యాదాసి మాదిగవానికిఁ జెప్పనిచ్చి వెళ్లిన తరువాతఁ దంత్రముననది వానియొద్దనుండి తీసికొని యాయడుగుగుర్తుల మీఁదఁ బెట్టి చూచిరి. అది సరిపోయెను. ఆసేవకులు మిక్కిలి సంతోషించినవారై యాపరిచారిక సనిన యిల్లు గురుతుంచుకొని రాజున కాసంగతి నెఱిగించిరి.

వెంటనే మహారాజు పట్టరాని యానందమునఁ బాదచారియై సేవకులు దారిచూపగా నాదాసివెళ్లిన యింటికిఁ బోయెను. అది కాళిదాసుని ప్రియురాలగు విలాసవతి యిల్లు రాజు వచ్చియున్నవాఁడని తెలిసిన వెంటనే కాళిదాసుఁడును విలాసవతియు మిగుల భయపడినవారై తొట్రుపాటుతో నుండిరి.

అప్పుడు మహారాజు లోనికిఁ జని కాళిదాసునిగని 'కాళిదాసా, కవిచంద్రా, నాప్రాణసఖా' యనుచుఁ బాదముల మీఁదఁబడెను. కాళిదాసు సిగ్గుచేఁ దలవంచుకొని రాజును

లేవనెత్తి కౌఁగిలించుకొనెను. భోజమహారాజానందబాష్పములు గార్చుచు, "కవికులభూషణమా, నన్ను మన్నించుము. నీచే మన్నింపఁబడఁదగని గొప్ప తప్పు చేసినవాఁడను. అయినను నామీఁద నుండు ప్రేమాతిశయమున నన్నుఁ గరుణించి మన్నింతువని వేఁడుకొనుచున్నాఁడను" అని ప్రార్థించి విలాసవతిఁ జూచి "ఓపుణ్యవతీ, నేను దౌర్భాగ్యుఁడనై కాళిదాసును బోఁగొట్టుకొన్నను నీవు నీప్రేమగుణపాశముచేఁ బంజరములోని చిలుకనువలె నాతని భద్రపఱిచితివి గనుక నీవెక్కుడు ధన్యురాలవు. అదియునుంగాక యిప్పుడీ కవి కనఁబడనియెడల నేను ప్రాణము వదలనై యుంటిని. నన్ను బ్రదికించిన సుకృతమును నీకుఁ దక్కినది" అని యనేకవిధములఁ బొగడి యమితవస్తువాహనముల నామెను దృప్తిపఱచి కాళిదాసునిఁ దన వాహనముపైఁ గూర్చుండఁబెట్టుకొని మహావైభవమున నూరేగుచుఁ దన నగరికిఁ దీసికొని పోయెను.

ఇరువదియాఱవ ప్రకరణము.

కాళికాదేవి ప్రత్యక్షమగుట.

తరువాతఁ దన రాజ్యమంతయు శృంగారించి యుత్సవము చాటించి పండుగలు చేసెను. ఒకనాఁడు మిక్కిలి యుల్లాసమున మహారాజు కూర్చుండి కాళిదాసుంజూచి "మిత్రరత్నమా, విలాసవతి యమ్ముటకై బజారునకుఁ బంపిన

యమూల్యాభరణ మెక్కడిది? దాని వృత్తాంతమును వినిపించి వీనుల కొఱంతఁ దీర్పుమా. దానినిఁ జూచినప్పుడే నేనది సాధారణమైనది గాదనియు నీమీఁదనుండు 'మంగలివాఁడను నపనిందఁ బాపుటకై జనించినదనియు దృఢముగ మనస్సున నూహించితిని. ఈవిషయము సకృచ్ఛముగ నెఱిఁగించి నాసంశయవిముక్తిఁ జేయుము" అని యడుగఁగాఁ గాళిదాసు, "మహారాజా, నీచే నట్లు విడువఁబడి ముందు నా ప్రియురాలిచెంత కేగి నేనూరువిడిచి పోవుచున్నా నని చెప్పఁగా నా నెచ్చెలి, 'ఇట్లు నన్నొంటరిగ దిగవిడిచి పోవుట తగునా? ఏలాగైనను నాయొద్ద నుండి యెవ్వరికిఁ దెలియనీక నీయపనింద బాపుకొను నుపాయ మాలోచింపు' మనిన 'నట్లే' యని యియ్యకొంటి" నని చెప్పిధ్యానము చేయువానివలెఁ గొంతసే పూరకుండెను.

వెంటనే యా సభాసదులమనంబు లాశ్చర్యమగ్నములు గాఁగ నొక క్షీరసాగర మగపడెను. ఇదియేమి వింత యని చూచునయనవిభ్రమము తీఱకమునుపే దాని నడుమ మణులతో మెఱసెడు నొక ద్వీపకల్పము గనఁబడెను. కన్నులు చెదిరిపోవునట్లుండు నామణుల కాంతికి నాశ్చర్య పడుచుండ సెలయేఱులతోను, ఫలభరితద్రుమంబులతోను నిండి మిక్కిలి రమణీయమైన బిల్వకాంతార మొకటి కానిపించెను.

మెఱుపు మెఱసి నట్లు కనపడు నీవిచిత్రనాటకముఁ

జూచి యచ్చటి సభవార లొకరితో నొక రీయాశ్చర్యముఁ జెప్పుకొనుటకైన వీలులేనందున నిశ్చలులై మిక్కిలి యుత్కంఠతోఁ జూచుచుండిరి. అప్పుడా బిల్వకాంతారము నడుమ పారిజాతవనము గనఁబడెను. అట్టి వనమధ్యంబున మణిమయవేదికపై మృదుమధురకదళీపల్లవకోమలములైన హస్తముల రెంట వీణ మీటుచు నొకచేతఁ దాళమును, నింకొక చేతఁ బుస్తకము నుంచుకొని శ్రీశారదాదేవిం బోలి సింహవాహనారూఢయై కాళికాదేవి యావిర్భవించెను.

అట్టి తేజస్వినియైన యాకాళికాదేవిని జూచినతోడనే భయసంభ్రమ మనంబులతో నాసభయందున్న మహారాజును, మంత్రులును, పండితులును గాళిదాసుతోఁగూడ లేచి దేవి కంజలి పట్టి నిలుచుండిరి.

అప్పుడు మహారాజు మనంబునందు, "ఆహా! ఈకవి యెంత సామర్థ్యముగల మహానీయుఁడు. చేతులు ముకుళించి ప్రార్థించున ట్లొకనిమిష ముండఁగనె కుమారునిఁ జూచుటకు వచ్చిన తల్లివలె భక్తుని మొఱ నాలకించి ప్రసన్నయయ్యెను. ఆహా! ఈదేవి పాదంబులం దొకటి మంజీరము గలిగి యుండుటయు రెండవది లేకుండుటయుఁ జూడఁగా భక్తునికొఱకుఁ దానిచ్చిన మంజీరమే మనయొద్ద నుండునది యని తెలియుచున్నది. ఆహా! ఈతల్లి భక్తపరాధీన యనుమాట నిజమైనది. తనయొక్క యలంకారమైనఁ జూచుకొనక భక్తుని యా

పదఁ బావుటకై నూపుర మొసఁగియుండునని నాకుఁ దోఁచుచున్నది" అని తలఁచుచుండఁగానే కాళికాదేవి మహారాజును జూచి ,,రాజా, నాభక్తుఁడగు కాళిదాసు ప్రార్థించుటచే నాలోకమునుండిఁ గూడ మీకు దర్శనమిచ్చితిని. అతని కోరికపైని నీసందేహము తీర్ప నుద్యుక్తురాలనై యున్నాను" అనెను.

అంత భోజమహారాజు ,,ఓసర్వలోకైకజననీ, భగవతీ, నీవు భక్తపరాధీనవు. బిడ్డను దృష్టిపఱచెడు పశువు లితరులఁ గూడఁ గాపాడురీతి నీకవియందుండు ప్రేమాతిశయమున మాకందఱకుఁ గానఁబడితివి. నీదర్శనముచే మావంశములు పావనంబు లయ్యెను. కాని, నిన్నుఁ గనుఁగొన్నతోడనే మిక్కిలి సుందరములైన నీకుసుమకోమలావయవములు రత్నాభరణములచే మాకన్నులకుఁ బండువు సేయుచుండ నొక పాదము మాత్రము భూషణాలంకృతమై రెండవది తద్విహీనమై యుంట మాకుఁ గడువిచారమును గలిగించుచున్నది. తల్లీ, అది యెందుచేతనో యెఱిఁగింపుమా?" అని వేఁడెను.

ఆదేవియు, ,,వత్సా, భోజరాజా, వినుము. నీ సభయందుండు పండితులపన్నాగముచే మంగలివాఁడు చేసిన కపటమునకై కాళిదాసు మిక్కిలి చింతతో ననేకవిధముల నన్ను స్తుతించి పాదసేవచేయఁగా సంతసించి సాక్షాత్కరించి యతని మనోవికార మెఱిఁగి, 'కాళిదాసా, వెఱువకుము.

దీని నెట్లైన మహారాజున కందఁజేయు' మని యొక కాలియందుండు మంజీర మిచ్చితిని. నాకు భక్తులే యలంకారములు గాని దివ్యమణులుగావు. భక్తులకొఱకుఁ బ్రాణములనైన నిచ్చుటకు సిద్ధముగ నుందును." అనిచెప్పెను.

అది విని భోజభూపతి ముకుళితకరకమలుఁడై కాళిదాసువైపు దిరిగి ,,యోభక్తాగ్రగణ్యా, నీవే యీదేవి రెండవ పాదమునందలి కొఱంతఁ దీర్పఁగలవాఁడవు. ఎట్లైన నామెను సంతసిల్లఁజేసి యాపాదమున కీయందెఁ దొడిగి మాకన్నుల కఱవు తీర్పుమా" యని తనయొద్దనున్న రెండవ యందియ నందిచ్చెను.

కాళిదా సతిభక్తితో నచ్చటఁ గలవారలందఱుఁ జూచుచుండ ననేక విధముల స్తోత్రముచేసెను. అందుల కామె మనంబు సంతోషముచే వికసింపఁ జిఱునగవు గలదై భక్తునివైపు కాలు సాఁచెను. అది గని కాళిదాసు భయసంభ్రమంబులతోఁ దనతల నామె చరణంబులు సోఁక వంచి వినయముతోఁ దొడిగెను. ఆదేవియు 'సత్యము తప్పక రాజ్యమును బాలింపు' మని భోజభూపతిని దీవించి యంతర్హితయయ్యెను.

సభాసదులు కాళిదాసు మహిమను వేనోళ్లఁ బొగడిరి. పండితులందఱు గర్వమడఁగఁ గాళిదాసున కానతులై యెట్టి

భేదమును జూపక నడుచుకొనిరి. మహారాజేయిక్కట్టులు లేక ప్రియభార్యతోను స్నేహితుఁడగు కాళిదాసుతోను నెప్పటియట్ల సంతోషమున నుండెను. ఓ దేవేంద్రా, అట్టి పతివ్రతను గూడి చేయుదానకీర్తి యిది.

అని చెప్పిన నారదు వాక్యములను నచ్చటఁ గల దేవతలును, దేవేంద్రుఁడును 'గాఁవుననేయిల్లున్న' దని సంతోషించి భూలోకపు వింతమైన యాకథను విని యావాఁడు సభఁ జాలించిరి.

సమాప్తము.

శ్రీకృష్ణ ముద్రాక్షరశాల, రాజమండ్రి.

తప్పొప్పుల పట్టిక.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
3	12	చెవ్ప	చెప్ప
4	15	చెరి	చేరి
5	18	తెలిసుకొని	తెలిసికొని
9	3	శాశనము	శాసనము
31	10	కాళోత్తుదుండ	కాళ్లోత్తుచుండ
35	19	వేళమైనను	లేళమైనను
37	17	నిశ్చేష్టుఁడై	నిశ్చేష్టుఁడై
39	3	జమ్మమునకు	జన్మమునకు
	8	అపద్బాంధవు	ఆపద్బాంధవు
40	17	కృష్ణమూర్తి	కృష్ణమూర్తి
43	4	అమె	ఆమె
48	12	పొవలేను	పోవలేను
52	20	అనుగువ	ఆమగువ
58	5	మొదర్పద	మొనర్చద
	18	కొంతకామునకు	కొంతకాలమునకు
70	1	పదునాలుగవ	పదునేనవ
82	10	అమాటలు	ఆమాటలు
83	7	కేవట్టితిపనియు	కేవట్టితివనియు
	14	మీముఖ	మీముఖు
92	13	కొన్న	కొన్ని
9	4	రెండు	రెండు
15	3	,,	,,
	14	,,	,,
	15	,,	,,



For Copies apply to:-

Srimati C. Lakshmamma Garu

C/o C. S. V. Reddy Esq.

CATTAMANCHI, CHITTOOR.

END OF
TITLE